# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267
web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము
గూడూరి వెంకట రత్నం
డి.జె. బాలకృష్ణ లాల్
డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి
మిస్. పి. ఇందిరాదేవి
డా॥ యమ్. స్వర్ణముఖి

సంపుటి 35 సంచిక 4
పేజీలు 40
డిసెంబర్ 2015

5సం॥ల చందా రూ. 250
2సం॥ల చందా రూ. 120
సంవత్సర చందా రూ. 60
విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ , A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL

**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**

భద్రవాక్యం ........................................2
శ్రీబాబూజీ ఉవాచ..................................3
అమ్మమాట...........................................5
బంగారు క్షణాలు ..................................7
సన్నిధిలో సంభాషణ ..............................9
యోగిని శ్రీచంద్రకాళీ ప్రసాద మాతాజీవారి షష్ఠిపూర్తి మహోత్సవం – నివేదిక ............10
పరమపూజ్య శ్రీ విద్యాస్వరూపానంద స్వామి వారి ప్రవచనం ..................................13
పరమపూజ్య శ్రీదండి నిర్మలానంద స్వామి వారి ప్రవచనం ..................................15
పరమపూజ్య శ్రీమాతాజ్యోతిర్మయానంద భారతివారి ప్రవచనం ...........................17
యోగవాశిష్ఠము ..................................19
మహాభారత నీతి చంద్రిక.....................21
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు..................23
పరిప్రశ్నేన సేవయా ............................24
సరిలేరు మీ కెవ్వరూ ..........................26
శ్రీకృష్ణకర్ణామృతము.............................27
కర్మయోగము ....................................29
అమృతబిన్దూపనిషత్ ..........................31
అమెరికా పర్యటనలో శ్రీమాతాజీ బోధ........33
సత్సంగామృతం...................................35
సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర...........37
విష్ణు కథలు– భక్త కబీర్‌దాస్.................39

# భద్రవాక్యం

- పరాశర ప్రసాద్

అన్యదేవాహుర్విద్యయా అన్యదాహు రవిద్యయా ।
ఇతి శుశ్రుమ ధీరాణాం యేనస్త ద్విచచక్షిరే ॥
(ఈశావాశ్యోపనిషత్ 10శ్లో॥)

మానవులు పొట్టకూటికోసం అందుబాటులో వున్న విద్యని అభ్యసించి, దానినే ధ్యేయంగా ఆ విద్యలోని సాంకేతిక పరిజ్ఞానాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, పరిశోధించి పదవులు, కీర్తి ప్రతిష్ఠలు సంపాదిస్తున్నారు. ధనాన్ని కూడబెడుతున్నారు. తనని మించిన విజ్ఞానవంతుడు ఇలలోనే లేడనుకుంటున్నాడు. చివరికి వట్టిచేతులతో మట్టిపాలవుతున్నాడు.

ప్రాపంచిక విద్య మానవుని మనుగడకు అవసరమే. కాని అది తన జీవిత పరమావధి ఏమిటో తెలుసుకోవడానికి తోడ్పడదు కదా! ఆ విషయాన్ని ఆత్మజ్ఞాన సంపన్నులైన వారు యెంత చెప్పినా ఉత్తరదక్షిణ ధృవాల పొత్తు సాధ్యమేనా? అలాగే యిదీ అసంభవమే.

బ్రహ్మవిద్య మానవుడు తన జీవిత పరమార్ధాన్ని తెలుసుకోవటానికి తోడ్పడుతుందని ఆత్మజ్ఞానసంపన్నులు యెంత చెప్పినా విని వురకున్నా ఫరవాలేదు కాని, దాని యందు వ్యతిరేక భావము లేకుంటే చాలు. ఆ స్థితి యెప్పటికైనా తోడ్పడవచ్చునేమో!

తత్త్వ సాధన చేయకుండా, అజ్ఞానదిశను వీడకుండా చేసే ప్రయాణము బ్రహ్మమును పొందవలెనంటే యెలా సాధ్యపడుతుంది?

# శ్రీ బాబూజీ ఉవాచ - పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్ భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ "మోక్షము అంటే ఏమిటి?" అని ప్రశ్నించారు. "మోక్షము అనేది బ్రతికుండగానే మానవుడు ఈ శరీరముతో జ్వరాన్ని ఎలా అనుభవిస్తాడో ఆ విధంగా అనుభవించాలి. అంతేగాని అది చనిపోయిన తరువాత పొందేది మాత్రంకాదు. మానవుడు మోక్షస్థితిలో ఉన్నాడు. కానీ ఆ స్థితిని గుర్తింపనీయకుండా అజ్ఞానము లేక అవిద్య అనే మబ్బుతెర అడ్డుపడుతోంది. అదే దేహభావన లేక బాహ్యదృష్టి మనస్సు అంతర్ముఖమై బాహ్యదృష్టిని లేక దేహదృష్టిని మరచినపుడు జీవుడు మోక్షస్థితిలోనే ఉంటాడు అన్నారు.



అంత్యకాలంలో మనస్సు దేహాన్ని మరచి ఆత్మయందే రమించి యున్నప్పడు జీవభ్రాంతి తొలగి దేహభ్రాంతి లేకుండా దేహము త్యాగము చేసి జీవన్ముక్త స్థితిని పొందుతున్నాడు. మహాత్ములందరూ వారు దేహాన్ని ఎక్కడ త్యాగం చేసినా, ఎలా త్యాగం చేసినా దేహానికి విలక్షణ స్థితిలో ఉంటారు. వారు దేహాన్ని స్వచ్ఛందముగా సునాయాసంగా ఒక షర్టుని విడిచినట్లుగా వదిలివేస్తారు. ఇక్కడ మీకొక దృష్టాంతము చెబుతాను. జగన్మాత జానికీ దేవి అవతార పరిసమాప్తి అయిన తరువాత శ్రీ రామచంద్రుడు గురుదేవులు శ్రీ వశిష్టులవారితో ఇష్టాగోష్ఠి సమావేశములో వశిష్ఠులవారు శ్రీ రామచంద్రుని అంతరంగికంగా సంభాషించడానికి కోరారు.

శ్రీరామచంద్రుడు సోదరుడు లక్ష్మణస్వామిని పిలిచి లోపలికి ఎవ్వరినీ పంపవద్దని ఆజ్ఞాపించారు. వశిష్టులవారు మాట్లాడుతూ "రామచంద్రా! మీరు వచ్చిన పని అయిపోయింది. మీరాక కోసం వైకుంఠ వాసులంతా ఎదురుచూస్తున్నారు. కాబట్టి కుశలవులకు మీ బాధ్యతలను అప్పగిస్తే త్వరలో మీ స్వస్థానాన్ని చేరుకోవాలికదా! అన్నారు. ఇంతలో దూర్వాస మహర్షి శ్రీరామచంద్రుని దర్శనార్థం వచ్చారు. లక్ష్మణస్వామి ఆలోచనలో పడ్డాడు. దూర్వాసమహర్షిని లోనికి అనుమతించకపోతే తాను శాపగ్రస్తుడవటం తథ్యం. అనుమతిస్తే అన్నగారి ఆజ్ఞ మీరినట్లు అవుతుంది. ఈ రెండింటిలో దూర్వాసుని శాపమునకు గురికావడము కన్న అన్నగారి శిక్షను స్వీకరించడానికే లక్ష్మణస్వామి నిర్ణయించుకున్నాడు. వెంటనే లోపలికి పోయి అన్నగారయిన శ్రీ రామచంద్రునికి దూర్వాసమహర్షి వచ్చిన విషయాన్ని తెలియజేస్తూ ఆజ్ఞ మీరినందుకు తనకి తానే శిక్ష విధించుకుని సరయూ నదిలోనికి వెళ్ళి దేహత్యాగము చేశాడు. చూశారా లక్ష్మణస్వామి తన అన్నగారి

ఎడల చూపిన స్వామిభక్తి! లక్ష్మణస్వామి అవతారము చాలించి వైకుంఠములో శ్రీరామచంద్రుని రాకకోసమై శేషపాన్పును ఏర్పరచి ఉంచారు.

సరయూనదిలో లక్ష్మణస్వామి దేహత్యాగము చేసిన విషయము తెలుసుకున్న శ్రీ రామచంద్రుడు తానుకూడా సరయూనదికి చేరి తన దేహాన్ని త్యాగం చేసి అవతారము పరిసమాప్తి కావించారు. చూశారా! ఎందరో మహాత్ములు, అవతార పురుషులు దేహము ధరించి వచ్చి మానవకోటికి తమ బోధామృతాన్ని అందించి, తిరిగి వారి స్వస్థానాన్ని చేరుకున్నారు. అటువంటి మహాత్ములలో శ్రీ సమర్థరామదాస్ తన అవతార పరిసమాప్తి సమయంలో ప్రియశిష్యుడైన కళ్యాణ్‌ను దూరప్రాంతాలకు పంపించారు. కళ్యాణ్ గురుదేవులు అప్పగించిన పనిని పూర్తిచేసుకుని తిరిగి వచ్చేసరికి గురుదేవులు అవతారం చాలించిన విషయాన్ని తెలుసుకుని ఆయన సమాధిపై పడి తలకొట్టుకుని భోరు భోరున దుఃఖించాడు. ఆకస్మాత్తుగా గురుదేవులు సమాధినుండి సశరీరులై బయటకు వచ్చి కళ్యాణ్‌ను ఊరడించి 'పిచ్చివాడా! ఈ ఉపాధి అశాశ్వతమైనది. నువ్వు నమ్మిన సమర్థులైన గురువు సర్వ వ్యాపకుడు ఆయన ఈ ఉపాధికి పరిమితమైన వాడు కాదు. ఆ విషయాన్ని గ్రహించి, ఆత్మజ్ఞాన సంపన్నుడవై నేను బోధ చేసిన గురుతత్త్వాన్ని ప్రచారం చేసి నీ జీవితాన్ని ధన్యం చేసుకో' అన్నారు.

శ్రీ బాబూజీ మహరాజ్ మాట్లాడుతూ ఇది యదార్థమేనా? నమ్మదగినదేనా? మీరు నమ్ముతారా ? అని అక్కడ ఉన్న భక్తులను ప్రశ్నించారు. ఇంకా మాట్లాడుతూ గురుదేవులు సర్వశక్తిమంతుడు. ఆయన శక్తిని అంచనా వేయలేము. ఆయన సగుణంగా నిర్గుణంగా ఎన్నో అనుభూతులను అందజేస్తారు. ఆయన దేహము కనుమరుగైనా ఆయన సమాధిని ఆశ్రయించి సాధన చేసే సాధకులకి ఎన్నో అనుభూతులు కలుగుతాయి. వారికి మోక్షము కూడా కరతలామలకం.

శ్రీ బాబూజీ మహరాజ్ ఇంకా మాట్లాడుతూ మహాత్ముల చరిత్ర మనస్సు నిలిపిచదివినవారు గాని శ్రవణం చేసిన వారు గాని దానికి కేటాయించిన సమయము నిత్యకాలములో జమ అవుతుంది. అది గొప్ప సాధనగా పరిగణింప బడుతుంది. సద్గురు మూర్తిని విశ్వాసంతో ఆశ్రయించి తన శరీర ఆరోగ్యస్థితిని కూడా లక్ష్యపెట్టక తన జీవితాన్ని సద్గురుమూర్తి సేవకే అంకితము చేసిన కళ్యాణ్ వంటి శిష్యులకు ఇక ఏ రకమైన సాధనతో నిమిత్తము లేకుండా మోక్షము ప్రాప్తిస్తుంది. అటువంటి వారికి ఇహంలోనూ, పరంలోనూ ఏ విధమైన లోటు ఉండదని మీ హృదయబాబు హెచ్చరిస్తున్నారు.

# అమ్మ మాట

- జపమాల ప్రసాద

## ఆనందో బ్రహ్మ

"ధ్యానమూలం గురోర్మూర్తిః। పూజామూలం గురోఃపదం।
మంత్రమూలం గురోర్వాక్యం। ముక్తి మూలం గురోఃకృపా॥

అని శ్రీగురుగీత చెబుతోంది. శ్లోకమయితే కంఠస్థం అవ్వచ్చు. కాని అది అనుభవానికి రావాలి. మనం ధ్యానానికి కూర్చున్నామంటే దానికి మూలం శ్రీగురుదేవుల దివ్యమంగళ మూర్తి. మనం పూజ చేయ వలసినది కేవలం గురుపాదమే కాదు; గురుముఖస్తుగా వచ్చిన పదములను. గురుముఖస్తుగా వచ్చిన ప్రతి వాక్యము మహామంత్రమే. అసలు ముక్తికి మూలం కేవలం శ్రీగురుదేవుల కృప మాత్రమే.

అందుకని 'గురుమూర్తిమ్ స్మరేన్నిత్యమ్
గురోర్నామ సదా జపేత్
గురోరాజ్ఞాం ప్రకుర్వీత
గురోరన్యం న భావయేత్।' అని కూడా చెప్పబడింది.

ఇది మనం సులభంగా ఆచరించడానికనేనేమో శ్రీగురుదేవులు తాము వ్యాహ్యాళికి వచ్చినప్పుడు మనకి గురునామాలని కీర్తనగా అందించారు. 'ఓం శ్రీనాథా! గురుమహరాజా; చక్రపాణీ! గురుమహరాజా; తేజోరూపా! గురుమహరాజా; ఆనందనిలయా! గురుమహరాజా; ఆనంద దాతా! గురుమహరాజా; అజ్ఞానహరణా! గురుమహరాజా; జ్ఞాన ప్రదాతా! గురుమహరాజా; జ్ఞానస్వరూపా! గురుమహరాజా; జ్యోతిస్వరూపా! గురుమహరాజా; దక్షిణామూర్తీ! గురుమహరాజా; దత్తాత్రేయా! గురుమహరాజా; గీతాచార్యా! గురుమహరాజా; జగద్గురుస్వామీ! గురుమహరాజా; .................. ఎంత గొప్ప, లోతైన తత్త్వాన్ని అందించారు స్వామి వారు! గొప్ప తత్త్వం గురించి మాట్లాడాలంటే, ఆ స్వరూపం అయినవారు చెబితేనే బాగుంటుంది. అది వారికే యెరుక.

నారాయణోపనిషత్ నారాయణుడే చెప్పాలి. గురుతత్త్వం గురించి గురుదేవులే చెప్పాలి. ఆనందం అంటే కేవలం బ్రహ్మానుభూతే. అందరూ ఆ స్వరూపమే అయి వున్నారు. కానీ, అది గుర్తించడం లేదు. మనస్సు దాని యొక్క పూర్వపువాసనలు అడ్డువచ్చి, తన నిజస్థితిని

గుర్తించనీయటం లేదు. పూర్వపు వాసనలు మంచివీ అవ్వచ్చు; చెడ్డవీ అవ్వచ్చు.

ఇవాళ ఉదయం 2-30ని॥ కే మెలకువ వచ్చిందనుకోండి; ఆ(! ఇంకాస్సేపు పడుకుని లేద్దామనుకుంటారే - అది పూర్వపు దుర్వాసన. దీనిని అధిగమించాలంటే శ్రీగురుదేవులనే ప్రార్థించాలి. టి.వి. చూడటం, లోకాభిరామాయణం మాట్లాడటం మన సహజం కాదు. కొంతమంది ఒంటిగంట వరకూ లేచి వుంటారు. అటువంటివారు యింక తెల్లవారు జామున యేమి లేస్తారు? నిద్ర మన స్వరూపం కాదు. ఆకలివేస్తే అన్నం తినటం లాగానే శరీరానికి కాస్త విశ్రాంతినిచ్చేది నిద్ర. మితభాషణ, మిత నిద్ర, మితాహారం అనేవి సాధకులకి మూడు ముఖ్యమైన నియమాలు. వీటిలో యే ఒక్కదానిని ఆచరించినా మిగతావి లైన్‌లోకి వచ్చేస్తాయి.

ఆహారం తినేటప్పుడు భగవన్నామం చేసుకుంటూ మెల్లగా తింటే, ఎక్కువ తినం. ధ్యానం ఒక్కటే మనసు మరచి చేయమన్నారు. కాని ప్రపంచ విషయాలన్నీ మనస్సు పెట్టే చేయాలి. అందుకనే యే పని చేస్తున్నా భగవన్నామం అంటూ చేయమన్నారు మహాత్ములు. భగవంతుని నామం మనకు రక్షణ కవచమై యెంతవరకూ చేయాలో అంతవరకే చేయిస్తుంది. మన వలన తప్పు జరగనీయదు. - 'ప్రభూ! ఇది నీవిచ్చిన వరం నాయనా!' అని స్వీకరిస్తే చాలు. మనకి యెంత సరిపోతుందో అంతే తింటాం.

మనం ప్రపంచంలోనే వున్నాం. కానీ, మననీ, దానినీ కూడ సృష్టించిన వాడొకడున్నాడు. మన ముందే అన్నీ మారిపోతున్నాయి. అయినా యీ మారిపోయే జగత్తులోనే మార్పులేకుండా, శాశ్వతంగా ఒకటి ప్రకాశిస్తోంది. ఈ లోకంలోనే కొన్ని అలౌకిక శబ్దాలున్నాయి. అవి ఆలకించాలి. శ్రీగురుగీత, భగవద్గీత వంటివన్నీ అలౌకిక శబ్దాలు. అతినిద్ర పనికిరాదు. నిద్ర మన స్వరూపం కాదు. మన స్వరూపం కేవలం ఆనందం. 'ఆనందో బ్రహ్మ విజానాత్' అని చెప్తోంది వేదం.

భగవంతుడనేవాడు యూనివర్సల్. అందరివాడు. ఆయన అందనివాడు కాదు; శ్రీగురుదేవులు చైతన్య స్వరూపులు. చక్రపాణి; త్రిగుణాతీతుడు; త్రిగుణ హరుడు; ఆనందదాత. ఈ విధంగా శ్రీగురునామాన్ని అహర్నిశలు జపిస్తే యిక మాయకు తావెక్కడుంటుంది?

- సశేషం

# బంగారు క్షణాలు

- డా॥ స్వర్ణముఖి

(గత సంచిక తరువాయి)

శేషమ్మగారు - "ఉప్పుకప్పురంబు నొక్క పోలిక నుండు
చూడచూడ రుచుల జాడవేరు
పురుషులందు పుణ్యపురుషులు వేరయా
విశ్వదాభిరామ! వినుర వేమ!

(అని చదివి దాని అర్థం చెప్పారు)

ఉప్పూ, కర్పూరము రెండూ కూడా చూడటానికి ఒకేలాగ తెల్లగా వున్నా, వాటిని నాలుక మీద వేసుకుంటే రుచిని బట్టి మనకి యేది యేదో తెలుస్తుంది. అలాగే మనుషులందరూ వొకేలాగ వున్నా, వారివారి గుణాలను బట్టి, పుణ్యపురుషులెవరో తెలుసుకోవచ్చు" అన్నారు.

శ్రీబాబు - అబ్బే! అంతేనా దాని అర్థం! ఉప్పూ, కర్పూరము చూడటానికి ఒకేలాగ తెల్లగా గడ్డలు గడ్డలుగా వుంటాయి. కాని ఒక చిన్న పరీక్ష చేస్తే, వాటి గుణాలు తెలిసిపోతాయి. ఒక అగ్గిపుల్ల వేసి వాటిని వెలిగిస్తే యేమౌతుంది? కర్పూరం వెలింగించిన వెంటనే అంటుకుని, మంచి వెలుగుని, సువాసనని వెదజల్లుతూ, చివరికి యేమీ మిగలకుండా హరించిపోతుంది. కానీ ఉప్పో? నిప్పంటించేసరికి అది చిటపటలాడుతూ, కాలి, నల్లగా మాడిపోతుంది. అలాగే సజ్జనుడు కర్పూరం లాగ తన సర్వస్వం పరులకి ఉపకారం చేయడానికే వినియోగిస్తాడు. దధీచి మహాముని తన ఎముకలనే దేవేంద్రుడికి ఆయుధాలుగా చేసుకోమని యిచ్చివేసిన కథ మీకందరికి తెలిసినదే కదా! మహాత్ములు వారి సర్వస్వం లోక కళ్యాణానికే వినియేగిస్తారు. మరి దుర్జనుడో? అతను పైకి మటుకు డాంబికంగా మాటలు చెప్తాడు. ఉప్పులాగ చిటపటలాడుతూ చివరికి మాడి నశించిపోతాడు. ఇంతకీ 'రుచి' అంటే అర్థమేమిటండీ హనుమాయమ్మగారూ?

గురువుగారు - రుచి చూడటం - అంటే నాలుకతో రుచి చూడటం.

శ్రీబాబు - ఇంకేమని అర్థం ఉంది?

గురువుగారు - రుచి అంటే రోచస్సు. అంటే 'కాంతి' అనే అర్థం కూడా వుంది.

శ్రీబాబు - ఆఁ! ఆఁ! అదేమరి! నేనేమీ చదువుకోలేదు కదా! నాకివన్నీ యేమి తెలుస్తాయి? ఏదో, మా అమ్మ నా నోటమ్మట యేది పలికిస్తే, అది పలుకుతాను .... (అని నవ్వుతూ) ఇంకొకటి చెప్పండి.

గురువుగారు - "నా యమాత్మా ప్రవచనేన లభ్యో
న మేధయా న బహునా శ్రుతేన
యమే వైష వృణుతే తేన లభ్యః
తస్యైష ఆత్మా వివృణుతే తనూంస్వామ్"

శ్రీబాబు - అసలే నేను యేమీ చదువుకోలేదు. మీరు యిలా సంస్కృతం మాట్లాడితే మాకేం అర్థం అవుతుంది? పొట్ట చించితే అక్షరం ముక్కలేని వాడిని! ఏ ఉపనిషత్తులోనిదో, యెవరు చెప్పారో చెప్పండి గురువుగారూ!

గురువుగారు - ఇది కఠోపనిషత్తులోని మంత్రం. ఇది యమధర్మరాజు నచికేతుడికి చెబుతున్నాడు. ఎంత సూక్ష్మగ్రాహియైనా, యెంత వేదాధ్యయనం చేసినా, యెంతటి మేధావి అయినా కూడా ఆత్మతత్వం తెలుసుకోలేడు. గురుదేవుని కృపను సాధించిననాడే ఆత్మానుభూతిని పొందగలడు.

- సశేషం



# సన్నిధిలో సంభాషణ

(గత సంచిక తరువాయి) - పరాశర ప్రసాద్

"బ్రహ్మదేవుడు 'తప' అనే శబ్దాన్ని విని తపస్సు ఆచరించి చతుర్ముఖములతో మధురాన్ని గ్రోలుతూ చతుర్వేదములను అందజేశాడు. ఆధ్యాత్మిక పాదుకలు ధరించిన వారికి విషయాదులు అంటవు. ఈ సంసారములో కోరికలు, సంకల్పాలు అనే విషయాదులను అధిగమించి సులభంగా ప్రయాణము చేసి ఆ పరమాత్ముని చేరుకోగలుగుతాడు. వడ్లగింజల్ని ఒక మూకుడులో వేసి బాగా వేయిస్తే అవి మొలకెత్తుతాయా? అలాగే మీలోని కోరికలు సంకల్పాలు ధ్యానము అనే మూకుడులో వేసి ధ్యానాగ్నితో వేయిస్తే అవి రహితం అవుతాయి. అప్పుడు పరమాత్ముడిని చేరుకోగలుగుతావు. మానవుడిని పరమాత్ముడి దగ్గరకు చేర్చగలవాడే సత్యగురుదేవుడు. ఆయన మానవ హృదయ క్షేత్రంలో భక్తి బీజాన్ని నాటుతాడు. అది పెరిగి పెద్దదై మోక్షస్థితికి చేరుకుంటే దానిని చూసి ఆయన సంతోషిస్తాడు. దేహం నేను అనే భ్రాంతిని తొలగించి పునర్జన్మ లేనటువంటి స్థితిని పొందింపజేస్తాడు. అప్పుడు నరుడు జనన మరణ మత్స్యసాగరమును దాటగలుగుతాడు. మహా పండితులైనా సరే, ఎవరైనా సరే తమకు మరి జన్మలేదని గాని, పోనీ తిరిగి మానవ జన్మ వస్తుందని గాని చెప్పగలుగుతారా? అందువలన సదా భగవంతుని యందు మనస్సు నిలపాలి. భగవంతుని చేరుకోవటానికి ఏ మార్గం అవలంబించినా ఫర్వాలేదు.



అహంకారాన్ని త్యాగం చేసి ప్రతిఫలాన్ని ఆశించకుండా కర్మని ఆచరించి కర్మయోగం ద్వారా తరించవచ్చు. అటు ఇటు జారిపోయే చిత్తాన్ని నిరోధించి నిరంతరము భగవంతుని చరిత్ర శ్రవణం చేయటం, మననం చేయటం, నామము స్మరించటం, భగవంతుని సేవలో నిమగ్నమై ఉండటం ద్వారా భక్తుడై భక్తియోగము ద్వారా తరించవచ్చు. సంకల్పించే మనస్సును బాహ్య విషయాదుల నుంచి మరల్చి మనస్సుని త్యాగము చేసినవాడే నిజమైన సన్యాసి. అటువంటి సన్యాసి కర్మ సన్యాసయోగము ద్వారా తరించవచ్చు. అహంకారము, చిత్తము, మనస్సులను త్యాగము చేసినవాడి బుద్ధి మనోలయమై ఉంటుంది. అటువంటివాడే జ్ఞాని. అదే జ్ఞానయోగము అంటే. అటువంటి జ్ఞాని ముఖస్థుగా ప్రవహించే అమృత ధార మధురాతి మధురంగా ఉంటుంది" అని అన్నారు శ్రీబాబు.

# యోగిని శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీవారి జన్మదిన (షష్టిపూర్తి) మహోత్సవం - నివేదిక

- రమణ ప్రసాద్

శ్రీ మాతాజీవారి జన్మదిన వేడుకలలో పాల్గొనటానికి భక్తులు అసంఖ్యాకంగా తరలి వచ్చారు. ది.25.10.2015నుండి ది.28.10.2015 వరకు అఖండనామ సంకీర్తన, మృత్యుంజయహోమాలు జరిగాయి. అక్టోబరు 26నుండి 27వ తేదీ వరకు సాధు మహాత్ముల సత్సంగ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాలకు పరమ పూజ్య శ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు, శ్రీ శుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతులు, (శ్రీకాళహస్తి), పరమపూజ్య శ్రీశ్రీశ్రీ దండి నిర్మలానందగిరి స్వాములవారు, అష్టలక్ష్మి పీఠం, (తెనాలి), పరమపూజ్య శ్రీ మాతా జ్యోతిర్మయానంద భారతి వారు, శ్రీ షణ్ముఖానందాశ్రమ పీఠాధిపతులు, (పాలకొల్లు) విచ్చేసి తమ దివ్య బోధమృతాన్ని భక్తులకు అందించారు. షష్ఠిపూర్తి సందర్భంగా 350 మందికి పైగా భక్తులు 21రోజుల గురు దీక్ష తీసికొని ధ్యాన పారాయణాదులను అనుష్టించారు. అంతే కాక శ్రీకృష్ణాష్టమి 05.09.3015 నుండి ది. 27.10.2015 వరకు దేశ విదేశాలలో ఉన్న భక్తులు శ్రీమాతాజీ వారు సూచించిన విధంగా పారాయణలు నిష్ఠగా చేశారు. శ్రీ లలితా సహస్రనామ పారాయణ 125 కోట్లు(లక్ష్యం 60 కోట్లు); మహామృత్యుంజయ మంత్ర పారాయణ 164 లక్షలు(లక్ష్యం 60 లక్షలు); శివ కవచం 3లక్షలు(లక్ష్యం 60 వేలు) చేశారు.

ది. 27 ఉదయం శ్రీ మాతాజీ గురు సోదర సోదరీమణులకు నూతన వస్త్రములను ఇచ్చి వారిని సత్కరించారు. ఆ తరువాత శ్రీ మాతాజీ సాధు మహాత్ములకు యతి పూజ చేశారు. అనంతరం సర్వ నదీ జలలాలతో నింపి పూజింప బడిన 60 కలశాలతో శ్రీ బాబూజీ మహరాజ్ వారి పాదుకలు ఉంచిన జల్లెడతో శ్రీ మాతాజీ వారిని అభిషేకించారు. కర్తలు శ్రీ మాతాజీ వారికి పాదపూజ చేసుకున్నారు. భక్తులందరికీ శ్రీ మాతాజీ వారు తమ దివ్యాశీస్సులను అందించారు. ఈ విధంగా శ్రీ మాతాజీ వారి షష్టి పూర్తి వేడుకలు సాధనాపరంగా, ధ్యాన పరంగా, జ్ఞాన పరంగా జరిగాయి.

శ్రీ మాతాజీ షష్టి పూర్తి సందర్భంగా సత్సంగ సమావేశాలలో సాధు మహాత్ములు ఆశీః పూర్వక ప్రసంగాలు చేశారు. ముందుగా పరమ పూజ్య శ్రీశ్రీశ్రీ దండి నిర్మలానంద స్వాములవారు మాట్లాడుతూ - “ అమ్మ ఆశ్వియుజ పౌర్ణిమ నాడు జన్మించింది. వారు పూర్ణ స్వరూపులు. అందరినీ

పూర్ణ స్వరూపులుగా తీర్చి దిద్దటానికి అవతారం ధరించి వచ్చిన కారణ జన్మురాలు. శ్రీ చిరంజీవి రాజుగారికి, శ్రీమతి రాఘవమ్మగారికీ శ్రీ బాబూజీ మహరాజ్ వారి అనుగ్రహంతో లేక లేక పుట్టిన గారాల పట్టి. ఈమెకు చంద్ర శేషమాంబ అనే అన్వర్థ నామం పెట్టారు. నామ కరణ మహోత్సవంలో ఈ శిశువు భగవద్గీతను పట్టుకొని భగవద్గీత ప్రవచనానికి నాంది వాక్యం పలికింది. బాబూజీ వారు ఆమెను 'చంద్రా' అని 'అమ్మడూ' అని పిలిచేవారు. నేను మా అమ్మను 'బుజ్జి కన్నా' అని పిలుస్తాను. బాబూజీ వారు పూర్ణదీక్ష ఇచ్చే ముందు చంద్రకు అనేక పరీక్షలు పెట్టారు. 'నీకు వివాహం చేస్తాను. స్త్రీకి సంతానం కావాలి' అన్నారు. చంద్ర స్థిర చిత్తంతో, 'నేను భక్తి అనే గర్భాన్ని ధరించి జ్ఞానమనే పుత్రుడిని ఇస్తాను' అన్నది. అమ్మ షష్టిపూర్తి అపురూపం. అందులో పాల్గొనే అవకాశం కలిగించిన బాబూజీ వారికీ, మీ అందరికీ నా నమోవాకములు.

పూజ్య శ్రీ మాతా జోయిర్మయానంద భరతివారు మాట్లాడుతూ "గురువు దగ్గర తయారైన బొమ్మ అమ్మ. బాబూజీ పెట్టిన పరీక్షలను ఎదుర్కొని ఉత్తమ శిష్యురాలిగా, ఆశ్రమ పీఠాధిపతిగా శ్రీ బాబూజీ మహారాజ్ వారి ఆధ్యాత్మిక సందేశాలను దేశ, విదేశాలలో వ్యాప్తం చేస్తున్నారు. అమ్మ దయ ఉంటే అన్నీ సిద్ధిస్తాయి. 'నిత్య క్లిన్నా నిరుపమా నిర్వాణ సుఖ దాయినీ' అని అమ్మ నామాలలో ఉన్నట్లు, అమ్మ నిత్యం మన గురించి ఆలోచిస్తుంది. నా బిడ్డలు ఏమైపోతారా! వారిని ఆధ్యాత్మిక మార్గంలో ఎలా పెట్టాలా! ; వీరిని కష్టాలనుంచి ఎలా బయట పడవేసి మోక్ష సుఖాన్ని ఎలా కలిగించాలా' అని. తాను ఏ ఆనందాన్ని అనుభవిస్తున్నదో ఆ ఆనందాన్ని అందరికీ అందచేయాలనే తపన అమ్మది. ఎవరికి ఏ బాధ వచ్చినా వారు ఆ కష్టాలనుంచి బయట పడేవరకు ఆమె ఆవేదన చెందటం వారి సంక్షేమం కోసం అనుష్ఠానం చేయటం నేను ప్రత్యక్షంగా చూశాను. అమ్మ గురు కార్యాన్ని ఇనుమడించిన ఉత్సాహంతో నిర్వహిస్తూ, ఆశ్రితులందరికీ శాశ్వత సచ్చిదానంద సుఖాన్ని అందించాలనీ, అమ్మకి పూర్ణ ఆయుష్షును జగజ్జనని, ఋషులు అందించాలని ప్రార్థిస్తూ, హరిః ఓం.

పరమ పూజ్య శ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపానందగిరి వారు మాట్లాడుతూ- "మాతాజీ షష్టి పూర్తి కాలమానంలో ఒక చిన్న లింకు. ఎందుకు చేస్తున్నాము అంటే అనేకమందికి ఒసగే జ్ఞాన ప్రసాదానికి ఆమె సాధనమైంది. గురువు ఇచ్చిన ప్రసాదాన్ని ప్రచారం చేసే సాధనంగా, పనిముట్టుగా అయి అద్భుతంగా ఆనందంగా విస్తరించారు. దాని కృతజ్ఞతా సూచకమే ఈ షష్టి పూర్తి.

ఇటువంటి షష్టిపూర్తులు ఇంకా రెండు జరగాలి. దేశ విదేశాలలో ఆధ్యాత్మిక జ్ఞానం విస్తృతం కావాలి. సరస్సులో గులక రాయి వేస్తే నీటి తరంగాలు గట్టు అంచుకు తాకినట్టుగా, తామువేసిన రాయితో జ్ఞాన తరంగాలు వ్యాపించటానికి బాబుగారు ఒక సాధనాన్ని ఎన్నుకొన్నారు. అదే మాతాజీ. గురువులు అన్ని రకాల సామర్థ్యం ఉన్నవారికే తమ స్థానం ఇస్తారు. అటువంటి లక్షణాలు స్వామివారు అమ్మలో చూశారు. ఆమెకు పూర్తి బ్రహ్మ విద్యను ఉపదేశించారు. తమ శక్తులన్నీ ఆమెకు ధారపోశారు. మాతాజీ గురుకార్యాన్ని సామర్థ్యంగా నిర్వహించి అశేష జనాన్ని ఆకట్టుకున్నారు. ఈ భక్తి పరంపర ఇలానే అభివృద్ధి అగుగాక! ఎక్కడ శ్రద్ధ ఉంటుందో అక్కడ వృద్ధి ఉంటుంది. వారికి ఇంకా స్తోమతను, ఆయుష్షును ఇచ్చి ఈ ధర్మ పీఠాన్ని ఇంకా వ్యాపకము చేయుగాక! అటువంటి శక్తిని శ్రీమాతాజీవారు మీ అందరికీ అనుగ్రహింతురు గాక!

శ్రీ మాతాజీవారు ప్రసంగిస్తూ- " కేవలం ప్రతి అణువు, ప్రతి కదలిక ఎవరి అనుగ్రహంతో నడుచుకోగలుగుతున్నామో, ప్రతి శ్వాస ఎవరి అనుగ్రహంతో పీల్చుచుకోగలుగుతున్నామో, అది కేవలం గురుకృప. వారి కృప వలన ఉత్కృష్టమైన మానవజన్మ లభించింది. ఆ పాదాలు మనకు దొరికాయి. ప్రాపంచిక సుఖాలలో సుఖం లేదు. నిజమైన సుఖాన్ని అందించేది కేవలం పరమాత్మ తత్త్వం. గురువులు ఏదైతే ప్రసాదించారో ఆ మార్గంలో నడిస్తే వారి కృప లభిస్తోంది. అది అనంతం.

భిద్యతే హృదయ గ్రంథిః ఛిద్యంతే సర్వ సంశయాః ।
క్షీయంతే సర్వ కర్మాణి గురోః కరుణయా శివే ॥ అని చెప్తోంది శ్రీ గురుగీత.
కేవలం గురు కరుణచేతనే, వారి అనుగ్రహం చేతనే కర్మ రహితం అవుతుంది.
సర్వస్యచాహం హృది సన్నివిష్టః, మత్తస్స్మృతిర్ జ్ఞానమపోహనం చ ।
వేదైశ్చ సర్వై రహమేవ వేద్యో, వేదాన్త కృద్వేదవిదేవ చాహమ్ ॥ భగవద్గీత
గురుదేవులు మనందరికీ "మీ హృదయబాబు" అని అందించారు. ఆ బాబు తత్త్వాన్ని అనుభవించాలంటే, మీ మనో బుద్ధి చిత్తాహంకారాలను, సత్యము, శాంతి, దయ ప్రేమలుగా మార్చుకోవాలి. ఎప్పుడైతే మనస్సును, బుద్ధిని స్వామియందు నిలుపుతామో, వారు చెప్పినది ఆచరిస్తామో, వారికి ఇంక తరవాత అనేది లేదు. వారి మనస్సు మాధవ రూపాన్ని పొందుతుంది. గురుదేవుల కరుణ అంత గొప్పది.అటువంటి చరించే మహాత్ముల ఆశీస్సులను మనం పుష్కలంగా పొందాము. వారందరి చరణారవిందములకు శిరసా ప్రణమిల్లుతూ, గురుదేవులు ప్రసాదించిన అవకాశాన్ని పునీతం చేసుకొందుము గాక! అటువంటి భక్తిని, శక్తిని మన మందరము పొందుదుము గాక! సుఖీభవ!!

# పరమ పూజ్య శ్రీ విద్యా స్వరూపానందగిరి స్వామివారి ప్రవచనం

సేకరణ - రమణ ప్రసాద్

"ఈ పరిసర ప్రాంతాలలో ఎన్నో వేల మంది జనం ఉన్నా ఎక్కడెక్కడ నుంచో వచ్చిన కొద్ది మంది జనం మాత్రమే ఇక్కడ చేరాం. ఇక్కడకు చేరటంలో ఉద్దేశ్యము దుఃఖ నివృత్తి, సుఖ ప్రాప్తి. దుఃఖం కావాలని ఎవ్వరూ కోరుకోరు. సుఖం కోసం పాటు పడతారు. ఒకాయన కాశీకి పోవాలని విజయవాడ వెళ్ళే రైలు ఎక్కాడు. అది రామేశ్వరం వెళ్ళే రైలు. గమ్యం చేరగలడా? అలానే అందరూ సుఖాన్నే కోరుకుంటున్నారు. ఆనందం కోరుకుంటున్నారు. మరి దానికోసం పాటు పడేవారు ఎందరు? మీరు అదృష్ట



వంతులు. మీకు సద్గురు సమాశ్రయం దొరికింది. సత్సంగంలో పాల్గొంటున్నారు. మిగిలినవారు ప్రపంచంలో సుఖాన్ని వెతుక్కుంటున్నారు. ప్రపంచంలో ఆనందం ఉన్నదా? ఉందనుకోండి. కడుపునిండా అన్నం తిన్నవాడు మళ్ళీ అన్నం తినాలనుకుంటాడా? సుఖం, దుఃఖం ఈ నామ రూపమైన జగత్తులో లేదు. మరి దేంట్లో ఉంది? వేదాంతం ఒక ఉదాహరణ ఇస్తోంది- ఒకతను ఆశ్రమానికి వస్తున్నాడు. కరెంటు లేదు. చీకటిగా ఉంది. పక్కన ఏదో అలికిడి అయినట్టైంది. చూశాడు. ఎదురుగా నల్లగా ఒక ఆకారం నిలబడి ఉంది. అది దయ్యమో, దొంగో అని గుండె కొట్టుకోవటం మొదలైంది. ఇంతలో ఒకాయన సైకిలు మీద వచ్చి లైట్ వేశాడు. అది మోడు బారిన మొద్దు. అప్పుడు అతనికి భయంగాని, దుఃఖం గాని వుందా? మన సుఖ దుఃఖాలు కూడా అలాంటివే. మనం ఆనంద స్వరూపులం. ఏకమేవ'- అని శాస్త్రం చెబుతోంది. అది సత్ పదార్థం. అది నిత్యం. మూడు కాలాలలో ఆది మధ్యాంతం ఉండేది. త్రికాలాభాద్యం. అంతే కాదు. అది వ్యాప్తం. వ్యాప్తోవతీతి విష్ణుః - అది సర్వ వ్యాపకమైనది.

దేశ కాల వస్తు పరిచ్ఛేదాలు దానికి లేవు. నేను ఉన్నాను. నా శరీరానికి ఒక పేరు పెట్టారు. ఈ శరీరం నా నుండి వేరుగా ఉంది - అది వస్తు పరిచ్ఛిన్నత్వం. అక్కడ నేను ఒకచోటే ఉన్నానా? లేను- అది దేశ పరిచ్ఛిన్నత్వం.

నాకు 74 ఏళ్ళు. 100 సంవత్సరాల క్రితం నేను ఉన్నానా? లేను -. అది కాల పరిఛ్ఛిన్నత్వం. నేను అనే వస్తువు దేశ కాలాదులలో పరిఛ్ఛిన్నం లేనిది, నిత్యమైనది, సర్వ వ్యాప్తమైనది, స్వయం ప్రకాశమైనది, ఆనంద స్వరూపమైనది అంటుంది వేదం. మరి కనిపించే ఇవన్నీ ఏమిటి?

ప్రహ్లాదుడి తండ్రి అడిగాడు,'నారాయణా! నారాయణా! అంటావు. ఎక్కడ ఉన్నాడో నాకు చూపించు' అని గర్జిస్తాడు. దానికి ప్రహ్లాదుడు - 'ఇందుగలడందు లేడని 'సందేహము వలదు చక్రి సర్వోపగతుం డెందెందు వెదకి చూచిన నందందే కలడు దానవాగ్రణి వింటే.' అన్నాడు. వైర్‌లో కరెంట్ ఎక్కడ ఉంది? అంటే ఎక్కడ లేదు? వైర్ అంతటా ఉంది. 'తండ్రీ! అతడు సర్వోపగతుడు. వెదికి చూడు. ఎందుకు కనిపించడు? కనిపిస్తాడు' అంటాడు. 'అయితే నాకు ఈ స్థంభంలో చూపు' అంటాడు. అప్పుడు స్థంభంలో ప్రకటితమవుతాడు.

ఒక రాజు గారికి సందేహం వచ్చి ఆస్థాన పండితుడిని అడుగుతాడు. 'భగవంతుడు ఉన్నాడా? ఉంటే భగవంతుడు ఎక్కడ ఉంటాడు? ఏం చేస్తుంటాడు? ఎటు చూస్తుంటాడు? నీకు వారం రోజులు గడువు ఇస్తున్నాను. చెప్పకపోయావో నీ తల తీసేస్తాను.' అన్నాడు . అతనికి దిగులు పట్టుకుంది. ఈ పండితుడి దగ్గర ఒక సేవకుడు ఉన్నాడు. అతడు విషయం తెలుసుకొని' మీరు కంగారు పడకండి. నేను సమాధానం చెప్తాను' అని ధైర్యం చెప్పి రాజు గారి కొలువుకి వెళ్ళి 'పండితులవారు మీ ప్రశ్నలకు సమాధానాలు ఇయ్యటానికి నన్ను పంపారు' అంటాడు.

'చెప్పలేకపోతే పర్యవసానం ఏమిటో నీకు తెలుసు కదా! అంటాడు రాజు. 'తెలుసు' అంటాడు ఆ సేవకుడు. 'రాజా! నువ్వు నా దగ్గర శ్రవణం చేయాలంటే నువ్వు నా శిష్యుడివి కావాలి. అంటే నేను నీ గురువును. కాబట్టి నాకు ఉచితాసనం ఇచ్చి నువ్వు క్రింద కూర్చో' అని రాజుగారిని 'ఒక దీపం, ఒక గిన్నెలో పాలు తెప్పించండి' అంటాడు. అవి వచ్చాక ముందుగా దీపం వెలిగిస్తాడు. ఆ తరువాత పాలలో పుల్ల పెట్టి వెన్న కోసం తిప్పుతూంటాడు. 'ఏమిట్రా! పాలల్లో వెన్న ఎక్కడ ఉంది?'అంటాడు రాజు. 'పాలలో వెన్న వుంది. మీకు కనిపించటం లేదా' అంటాడు సేవకుడు. రాజు నవ్వి ' పిచ్చివాడా! పాలను కాచి తోడు పెట్టి చిలికితే కాని వెన్న రాదు' అంటాడు. 'రాజా! అలానే భగవంతుడు అంతటా ఉన్నాడు. దీపం కాంతి లాగా అంతటా ప్రకాశిస్తుంటాడు. నా వంటి సేవకుని రాజు చేయగల సమర్థుడు' అంటాడు.

- సశేషం

# పరమ పూజ్య శ్రీ దండి నిర్మలానందగిరి స్వామివారి ప్రవచనం

సేకరణ - రమణ ప్రసాద్

" దుర్లభం త్రయ మేవైతద్దేవానుగ్రహ హేతుకమ్ ।
మనుష్యత్వం ముముక్షుత్వం మహాపురుష సంశ్రయః ॥" అని చెప్పారు.
శ్రీ శంకరాచార్యులవారు. మళయాళ స్వాములవారు ఈ మూడూ ఉన్నా నాల్గవది ఆరోగ్యం ముఖ్యం. ఆరోగ్యం సరిగ్గా ఉంటేనేగాని ఈ మూడింటినీ సాధించలేము. మోక్షాపేక్ష కలిగింది. 'నేను ఎవరు?' అనే విచారణ చేస్తున్నావు. విచారణ సరిగ్గా జరగాలంటే ఆరోగ్యం బాగా ఉండాలి. కాబట్టి శరీరం జాగ్రత్తగా పెట్టుకో. ఈ శరీరమనే నావ ద్వారా తరించాలి. 'నేను బ్రహ్మను' అని తెలుసుకోవాలి. గాఢనిద్రలో ఉన్నా నీ పేరు అడిగితే 'రామయ్య' అనకూడదు. 'నేను బ్రహ్మను' అనాలి. ఆ స్థితి దృఢాపరోక్షానుభూతి. అంతవరకు శ్రవణ, మనన, నిద్ధిధ్యాసలు చెయ్యి. శ్రవణానికి గురపాదాలను ఆశ్రయించు. శ్రవణం వల్ల మల దోషం పోతుంది. మననం వల్ల విక్షేప దోషం (చాంచల్యం) పోతుంది. నిద్ధిధ్యాస ద్వారా శ్రవణానికి స్థిరత్వం ఏర్పడుతుంది.



ఆలయంలో భగవంతుడిని చూశావు. అది ప్రత్యక్షం. 'భగవంతుడు ఉన్నాడు' అని తెలుసుకోవటం పరోక్ష జ్ఞానం. అది శాస్త్ర వాక్యం ద్వారా, గురు వాక్యం ద్వారా తెలుస్తుంది. దేవుడిని మనస్సులో దర్శించి అది నేనే అనే భావన అపరోక్షం. ప్రత్యక్షాన్ని పరోక్షంచేసుకో. పరోక్షాన్ని అపరోక్షం చేసుకో.

అజో నిత్య శ్శాశ్వతోZ యం పురాణో
న హన్యతే హన్య మానే శరీరే ॥ భగవద్గీత

ఆత్మకు చావు పుట్టుకలు లేవు. అతడు జనన మరణములు లేని వాడు. శాశ్వతుడు. శరీరము చంపబడినను అతడు చంపబడడు. రాముడు అంటే ధశరథరాముడు కాదు. రమతీతి రామః ఆయన ఆత్మారాముడు, నిర్వికారుడు. ఆ తత్త్వం పరమాత్మ తత్త్వం. దానికి మార్పు లేదు. షడ్భావ వికారాలు శరీరానికే కాని శరీరంలోని 'తాను'కు మార్పు లేదు. తాను ఏదైతై ఉన్నదో దానిని తెలుసుకోవాలి. 'నేను బ్రహ్మను' అనే అనుభవం రావాలి. అందుకొరకు సద్గురువును ఆశ్రయంచాలి. సద్గురువే దృఢాపేక్షజ్ఞానం కలుగచేస్తాడు. దేవుడు ఉన్నాడు అంటే చాలదు. ఆ భగవంతుడు ఎవరు?అది నీకంటే అన్యం కాదు.

ఉండేదంతా ఈశ్వర స్వరూపమే.'ఈశావాస్య మిదగ్ం సర్వం యత్ కించ జగత్యాం జగత్' - ఆయన లేని చోటు కించిత్తు అయినా లేదు అని ఈశావాశ్యోపనిషత్తు చెబుతోంది. తత్త్వం మారేది కాదు. మారి మారాకుండా ఏది ఉంటుందో అది అనిత్యత్వం. అదేచివరి నిష్కర్ష.

మానవుడికి ముక్తి కావాలి. ముక్తి అంటే మోక్షం. అది ఎలా వస్తుంది? వాసనాక్షయో మోక్షః - అని అన్నారు శ్రీ శంకరులు. వాసనలు ప్రక్షాళన అవటమే మోక్షం. అవి లోక వాసన, దేహ వాసన,శాస్త్ర వాసన అని మూడు. దేహాత్మ బుద్ధి పోతే మిగిలిన రెండూ పోవటం కష్టం కాదు. పురాణాల సారం కూడా ఇదే. భాగవతాన్ని తీసుకుందాం. కథలోకి వస్తే శమీకుడు తపస్సు చేస్తుంటే మృగాలను వేటాడి అలసి సొలసి దప్పిక గొన్న పరీక్షన్మహారాజు శమీకుని వద్దకు వచ్చి,'నాకు దప్పికగా ఉంది నీరు కావాలి' అంటే ఆయన నిమీలిత నేత్రుడై, శాంతుడై శమ దమాదులను నిగ్రహించినవాడై బ్రహ్మ వృత్తి సమాధిలో ఉన్నాడు. అందువల్ల ఆయన పలక లేదు. రజో తమో సత్వ గుణాలు దాటి శుద్ధ సత్వ స్థితిలో ఉన్నాడు. వివేకాన్ని కోల్పోయిన రాజు ఒక చచ్చిన పామును అతని మెడలో వేశాడు. శమీకుని కుమారుడు వచ్చి సంగతి తెలుసుకొని వారం రోజులలో బ్రతికి ఉన్న పాము వచ్చి కరచు గాక! అని శపించాడు. అతడు ఐదు ఏళ్ళ వాడు. తపస్సు చెయ్యలేదు. అయినా ఎలా వచ్చింది ఆ శక్తి? వారి వంశంలో ఏడు తరాల వారు అబద్ధం ఆడి ఎరుగరు. ఆ ప్రభావంతో వచ్చింది. శుద్ధ సత్వ స్వరూపుడైన శమీకుడు పుత్రుడిని శాపం ఉపసంహరించుకోమంటే అతని శక్యం కాలేదు. దేహాత్మబుద్ధి ఉండటమే రాజుని చచ్చిన పామును శమీకుని మెడలో వేసేటట్టు చేసింది. ఈ శరీరం జడం ఈ శరీరాన్ని కదిలించేవాడు లోపల ఉన్నాడు. ఈ జడమైన దేహాన్ని నేను అనుకొంటున్నావు. దేహాన్ని తాను అనుకోవటమే దరిమియాధ్యాస అన్నారు. నీవు సచ్చిదానంద స్వరూపుడవు. దేహాత్మ బుద్ధి పోవాలంటే గురువులనాశ్రయించవలసిందే. నగురోరధికం, నగురోరధికం శివ శాసనతః అని శ్రీ గురుగీత చెబుతోంది. ఆధ్యాత్మ రామాయణంలోని అంతరార్థానికి వెళ్తే - అయోధ్య అంటే ఈ శరీరం; దశరథుడు - దశేంద్రియాలను వశపరచుకున్నవాడు. ఆయన ముగ్గురు భార్యలు - కైకేయి-, ఇచ్ఛాశక్తి; సుమిత్ర- క్రియాశక్తి; కౌసల్య- చిచ్ఛక్తి. దశేంద్రియలు వశ పరచుకొన్నాడు కనుకనే అతనికి జ్ఞాన పుత్రుడైన రాముడు కలిగాడు. ఈ విధంగా ఇతిహాసాలలోని అంతరార్థాలను తెలుసుకొని విచారణ చేయాలి.

- సశేషం

# పరమపూజ్య శ్రీ మాతా జ్యోతిర్మయానంద భారతివారు

సేకరణ -రమణ ప్రసాద్

మనం జ్ఞాన గంగలో మునిగి ఉన్నాం. గోదావరి నదిలో స్నానం చేస్తే ఒంటికి ఉన్న మురికి పోతుంది. జ్ఞాన గంగలో మునిగితే మనస్సుకు ఉన్న మురికి పోతుంది. ఈ జగత్తు అంతా సత్వరజస్తమోగుణాలచేత మోహంలో పడి గుణరహితమైన సత్య వస్తువును తెలుసుకోలేక పోతున్నది. త్రిభిర్గుణమయైర్భావై:, ఏభిసర్వమిదం జగత్ । మోహితం నాభినాజానాతి, మామేభ్య పరమవ్యయమ్ ॥ (భగవద్గీత)

'వ్యక్తి మీద ప్రేమ ఉండవచ్చు కాని మోహం వుండకూడదు' అంటారు డోంగ్రేజీ మహరాజ్. మోహం బంధం. ప్రేమ భగవత్తత్త్వం. రాధకి కృష్ణుడికి;కృష్ణుడికి గోపికలకి; గురువుకి శిష్యుడికి ఉండే తత్త్వం ఏదైతే ఉందో దాని పేరే ప్రేమ. లోకంలో ఉండే జీవజాలం మూడు గుణాలలో బంధింప బడుతోంది. అవి సత్వ, రజస్తమో గుణాలు. శుద్ధ సత్వంలోకి వెళితే ఈ బంధాలు ఏమీ



చేయలేవు. నాది, నేను అంటే బంధంలో పడతాం. నీది, నీవుఅంటే బంధం ఉండదు. ఒక గొల్లవాడు అడవిలో మేకలు మేపుతున్నాడు. ఒక మేక వచ్చగడ్డి తను మాత్రమే తినాలనే దురాశతో మందలోంచి బయటపడి దారి తప్పింది. చీకటి పడింది. భయంతో బిగ్గరగా మే, మే అని అరిచింది. అది గొల్లవాడికి వినపడలేదు గాని ఎక్కడో ఉన్న తోడేలుకు వినిపించింది. అది వచ్చి మేకను తినేసింది. మే, మే అంటే నాది అని సంస్కృతంలో అర్థం. మేక జీవుడు. కాలమే తోడేలు. ఒక కప్ప పాము నోట్లో ఉండికూడా ఎదురుగా ఉన్న పురుగులను తినాలని ఆశిస్తుంది. ఈ పామును నెమలి తన కాళ్ళక్రింద తొక్కి పట్టింది. నెమలిని పులి మ్రింగటానికి సిద్ధంగా ఉంది. పులిని చంపటానికి బోయవాడు బాణం ఎక్కుపెట్టి ఉన్నాడు. వాడికోసం మృత్యుదేవత సిద్ధంగా ఉంది.మనం మృత్యుదేవత ఒడిలో ఉన్నా మని తెలుసుకోలేకపోతున్నాం.

ఎల్ల శరీర ధారులకు నిల్లను చీకటి నూతి లోపలం  
ద్రెళ్లక మీరు మేమను మతిభ్రమణంబున భిన్నులై ప్రవ  
ర్తిల్లక సర్వము న్నతని దివ్య కళామయయంమంచు విష్ణునం  
దుల్లము జేర్చి తారడవినుండుట మేలు నిశాచరాగ్రణీ ॥

ప్రహ్లాదుడు తండ్రితో అంటాడు, “ మీరు, మేము అనుకొంటూ దుఃఖాన్ని పొందకుండా,ఈ సర్వము హరియొక్క లీల అని ఎరిగి ఆ హరిని మనస్సులో నిలుపుకోవటం శరీరధారులకు శ్రేష్ఠమైన మార్గము” అని. ఈ విశ్వమంతా ఆయనది. భూవిరాపోZనలో వాయుః ఖం మనో బుద్ధిరేవచ - భూమి, జలము,అగ్ని, వాయువు, బద్ధి, అహంకారములతో కూడిన ఈ ప్రకృతి ఆయనది. అవన్నీ మనకే ఇచ్చి తరించాలంటే మామనుస్వర - నన్ను స్మరించు అంటున్నాడు.

మేకకు పచ్చిగడ్డి అంటే ఎంతో ఇష్టం. ఒక రాజు గారు మేక పచ్చగడ్డి తినకుండా చేస్తే అర్ధ రాజ్యం ఇస్తాను అని ప్రకటించాడు. రామకృష్ణ తాను చేయగలను అని చెప్పి ఒక మేకను మేపటానికి తీసుకువెళ్లి పచ్చగడ్డి పై మూతి పెట్టినప్పుడల్లా చింత బరికతో కొడ్తాడు. అప్పుడు దానిని ఆస్థానానికి తీసుకొని వెళ్లి మేక ముందు పచ్చగడ్డి పెడితే అది దానిని ముట్టదు. గురువును ఆశ్రయిస్తే, ఆయన మనస్సును ప్రపంచ విషయాలపై పోకుండా చేస్తాడు. మనస్స అన్ని విషయాలలో దూరుతుంది. ఈ ప్రపంచ విషయాలపై వెళ్లే మనస్సును గురువు చింత బరిక అనే మంత్రంతో కొడతాడు. అలా కొట్టగా కొట్టగా గురువు, మంత్రం గుర్తుకివచ్చి మనస్సు ప్రపంచ విషయాలపైకి వెళ్లదు. మనస్సు ఎటు రుచి మరిగితే దానివైపు తిరుగుతుంది. అది ప్రపంచ విషయాలు కానీయండి, పరమాత్మ విషయాలు కానీయండి.

రామకృష్ణ పరమహంస ఒక కథ చెప్పేవారు. గొల్లవాళ్ళు కొంతమంది నదీ ప్రవాహంలో నల్లగా ఏదో కొట్టుకు వస్తుంటే అది రగ్గులమూట అనుకొన్నారు. వచ్చేది చలికాలంకదా అందరూ ఒక్కొక్క రగ్గు కప్పుకోవచ్చు అనుకున్నారు. వాళ్లలో ఒకడు దానిని పట్టుకోవాలని ఈదుకొంటూ వెళ్ళాడు. వెళ్లిచూస్తే అది ఎలుగుబంటి. 'మూట దొరికిందా?' అని అడిగారు గట్టు మీద ఉన్నవాళ్లు. ' ఇది మూట కాదు ఎలుగుబంటి' అన్నాడు. 'అయితే దానిని వదిలి పెట్టు' అన్నారు వాళ్లు. 'అదే నన్ను గట్టిగా పట్టుకుంది' అన్నాడు. మనస్సును పరమాత్మ వైపు తిప్పితే అది దానిని వదిలిపెట్టదు. పరమాత్మను తెలుసుకోవాలంటే త్రిగుణాలను దాటాలి. ఎవరెవరు ఏ గుణాలలో ఉన్నారో విచారణ చేసుకోవాలి. దీనినే స్వాధ్యాయనం అన్నారు. గురువును ఆశ్రయిస్తే ఆయన 'ఈ విశ్వమంతా నిండి ఉన్న చైతన్యం నీలోను ఉన్నది' అని తెలియచేస్తాడు. గురుదేవుని అనుగ్రహంతో శుద్ధ సత్వంలో ప్రయాణం చేస్తూ సత్య స్వరూపాన్ని , శాశ్వత సుఖాన్ని పొందాలి. మనస్సు నిర్మలం కావటానికి నిరంతరం మంత్రాన్ని జపించాలి. అప్పుడు మనస్సు కాలిన త్రాడులా అయిపోతుంది. కాలిన త్రాడుతో దేనినీ కట్టలేరు. - సశేషం

(గత సంచిక తరువాయి) **యోగవాశిష్ఠము** - సుషుమ్నా ప్రసాద

అక్కడ నుండి కీర దేశమునకు వెళ్ళి, రాజ భవనమును అక్కడ ప్రజలు చెప్పిన తన జీవితములోని సంఘటనలు విన్నాడు అమితాశ్చర్యముతో అతని తల తిరిగిపోయింది. తనలో తను గాధి యిలా అనుకొన్నాడు, "ఇదంతా విష్ణు మాయా ప్రభావమా? ఇప్పుడు నాకు మాయా స్వభావము, దాని చేష్ఠలను గురించి, చక్కని అవగాహన వచ్చింది. మాయ, నిజంగా మనకవగాహన కందని, అద్భుతము కదా.



గాధి వెంటనే వొక పర్వత గుహలోకి వెళ్ళి భగవాన్ శ్రీహరిని గురించి వొక సంవత్సరము కఠోరమైన తపస్సు చేశాడు. కొంచెం నీరు మాత్రమే త్రాగి, జీవించాడు అప్పుడు శ్రీమహావిష్ణువతనికి ప్రత్యక్షమయి, యిలా అన్నాడు, "ఓ గాధీ, నీవు మాయ యొక్క మహిమను, దాని చిత్ర, విచిత్ర పోకడలను పూర్తిగా చూచావు. మాయా ప్రభావమెలా విస్తరిస్తుందో గ్రహించావు, నీకింకేమి కావాలి? ఎందుకీ ఘోర తపమాచరించావు?

వెంటనే గాధి శ్రీ మన్నారాయణునకు సాష్టాంగ ప్రణామమొనర్చి, స్తుతించి యిలా అన్నాడు."ఓ ప్రభూ! నేను మాయా స్వభావమును పూర్తిగా అర్థం చేసుకొన్నాను, కాని నేనింకా మాయయొక్క అంతర్గత స్థితిని గురించి, అయోమయ స్థితిలో వున్నాను. హే ప్రభూ! ఎందువల్ల ఆ మాయా కల్పిత దృశ్యాలు, జాగ్రదవస్థలో కూడ గోచరిస్తున్నవి? నేనిదంతా నీటి మధ్యలో నిలబడ్డప్పుడు కలిగిన అసత్యమైన, క్షణిక స్వప్నమనుకొన్నాను. కాని అవే దృశ్యాలు బాహ్యస్మృతిలోకి వచ్చిన తర్వాత కూడ యెందుకు

గోచరిస్తున్నవి? నేను ఛండాలునిగ పుట్టుట, జీవించుట చర్మచక్షువులకు కూడ యెలా గోచరిస్తున్నవి. అది కేవలము నా స్మృతిలో మాత్రమే వుండాలిగా? యని ప్రశ్నించాడు.

అప్పుడు శ్రీ మన్నారాయణుడిలా సమాధానము చెప్పాడు "నీవు బాహ్యముగా చూచినదంతా కేవలము మనసు సృజించిన దృశ్యము మాత్రమే, కాని బాహ్యంగా భూమి, సాగరము, పర్వతములు, ఆకాశమేవి లేవు ఇవన్నీ మనసులోనే వున్నాయి.

ఈ విశ్వము అందులోని సకల జీవరాశికి, వస్తువులకు వునికి మనసే, అవి యెన్నడూ మనసుకు భిన్నంగా వునికి కలిగిలేవు. మానవులంతా మనసు యొుక్క మోసానికి గురై, యీ ప్రపంచమంతా వాస్తవమని భ్రమించి, విషయ భోగాలను, ఆనందంతో అనుభవిస్తారు. పుష్పాలు, ఫలాలెలాగ బీజములో యిమిడివున్నట్లు, యీ భూమి తత్సంబధమైన విషయాలన్నీ, మనసులో యిమిడి వున్నవి.

ఈ జగత్తంతా మనసులోనే వునికి కల్గివున్నది. వర్తమానంలో కనిపించే దృశ్యాలు, గడిచిపోయిన భూతకాలంలో ఆలోచనలు దృశ్యం కాని భవిష్యత్తును గురించిన ఆలోచనలన్నీ మనసు యొక్క చేతలే. ఎలాగంటే కుండలు తయారు చేయటం, కుండలు ధ్వంసము చేయటం రెండూ కుమ్మరి పనియే.

ఈ జీవిత నాటకమందు, వొక సమయములో సగం ఘట్టాన్ని మాత్రమే ప్రదర్శిస్తుంది, అందుచేత మనసనే రంగస్థలిపై మనసు తనలో భద్రపరచిన ఘట్టాలలో, ఛండాలునికి సంబంధించిన వొక ఘట్టము ప్రదర్శించటములో, అద్భుతమేమున్నది? నీ సంతోషము కొరకనేకాద్భుత ప్రదర్శనలు చేయగలదు నీవాశ్చర్య పోవలసిన, ఆవశ్యకతే లేదు. ఓ గాధీ, నీ మనసుకు యీ విశ్వాన్నంతా తనలో యిముడ్చుకోగల సమర్థత వున్నప్పుడు, ఛండాలుని జీవితమనే వొక అల్పమైన అనామిక ఘట్టాన్ని, ఆకర్షించేట్లు చేయగలగటంలో, ఆశ్చర్యమేమున్నది?"

- సశేషం

# శ్రీ మహాభారత నీతి చంద్రిక

## గురుసేవా మహిమ

- శ్రీ రామానుజ దాసు

ఆ తరువాత శిష్యుడు ఉపమన్యుడు. ఇతని గురుసేవ అనితర సాధ్యం. గురువాక్యమును తు.చ. తప్పకుండా పాటించటంలో యితనికి మించినవారెవరూ వుండరేమో అనిపిస్తుంది. ఇతడిని గురువుగారు గోసేవలో నియమించారు. ఉపమన్యుడు రోజంతా గోవులను మేపి సాయంత్రం ఆశ్రమానికి వచ్చి గురువుగారికి నమస్కరించాడు. గురువుగారు అతడిని చూసి, 'నాయనా! చాలా లావుగా, దృఢంగా కనిపిస్తున్నావు యేమి తింటున్నావు?' అని ప్రశ్నించాడు.

'గురువుగారూ! నేను భిక్షమెత్తి భోజనం స్వీకరిస్తున్నాను' అన్నాడు. 'నీవు నాకు నివేదన చెయ్యకుండా భిక్ష స్వీకరించకూడదు. కాబట్టి నీవు భిక్షమెత్తిన భోజనం తెచ్చి నాకు సమర్పించాలి. తెలిసిందా?' అని ఆదేశించారు దౌమ్యులవారు. గురువుగారు చెప్పిన ప్రకారం భిక్ష తెచ్చి దౌమ్యులవారికి సమర్పిస్తున్నాడు ఉపమన్యుడు. గురువుగారు అదంతా తమ దగ్గరే వుంచుకునేవారు. ఆవులను మేపి సాయంత్రానికి ఆశ్రమానికి చేరుకునేవాడు ఉపమన్యువు. కాని అతని శరీర దృఢత్వంలో యేమాత్రం మార్పు లేదు. అంతకు ముందుకంటె కూడా శరీరం చాలా దృఢంగా వున్నది.

దౌమ్యులవారు 'నాయనా! ఉపమన్యు! నీవు తెచ్చిన భిక్షంతా నాకే సమర్పిస్తున్నావు కదా! నీవు యేమి తింటున్నావు? మరి నీ శరీర దృఢత్వానికి కారణమేమిటి?' అని అడిగారు.

'స్వామీ! మొదటి భిక్ష మీకు సమర్పించిన తరువాత రెండోసారి మరల భిక్షమెత్తి ఆ వచ్చినది నేను తింటున్నాను' అని చెప్పాడు ఉపమన్యు. 'నాయనా! రెండవసారి భిక్షకు వెళ్లటం అనుచితం కదా! పైగా యితరులు ఎవరైనా ఆకలితో అలమటిస్తూ భిక్షాటన చేసేవాళ్లకు అది ఆటంకం కదా! నీవే రెండుసార్లు భిక్షను గృహస్థుల నుండి గ్రహిస్తే యితర భిక్షార్థులకు ఆ గృహస్థులు భిక్షను యెలా యివ్వగలుగుతారు? దీని ద్వారా నీ లోభ బుద్ధి కూడా వ్యక్తమవుతుంది. సోమరితనం కలిగినవారు భిక్షాటనను ఒక సాకుగా తీసుకున్నారని లోకమంతా ఆడిపోస్తుంది. నిజంగా ఆకలి

కలిగినవాళ్ళను కూడా సోమరులుగా వెక్కిరిస్తుంది. ఈ పని యిక మీద చేయబోకు' అని ఆదేశించారు దౌమ్యులవారు.

గురువాజ్ఞను పాటించిన ఉపమన్యు మొదటి భిక్షను గురువుగారికి సమర్పించి, రెండోసారి భిక్షకు వెళ్ళకుండా నియమంగా జీవనం సాగిస్తున్నాడు. దౌమ్యులవారు ఉపమన్యువును యింకా నిశితంగా పరిశీలించారు. అతనిలో దృఢత్వం యింకా పెరిగిందేకాని, తరగలేదు. అతని ముఖం మిక్కిలి ప్రకాశిస్తోంది.

గురువుగారు 'నాయనా! నీవు భిక్ష కూడా స్వీకరించలేదు. రెండోసారి భిక్షకు పోవటం లేదు. అయినా దృఢంగా కనిపిస్తున్నావు. ఏమి తింటున్నావు?' అని అడిగారు.

'స్వామీ! మీరు చెప్పింది చెప్పినట్లే చేస్తున్నాను. భిక్షను స్వీకరించటం లేదు. దానికి బదులుగా ఆవుపాలు త్రాగి జీవిస్తున్నాను' అన్నాడు ఉపమన్యువు. 'నా ఆజ్ఞ లేకుండా పాలు కూడా త్రాగటానికి వీలులేదు' అన్నారు గురువుగారు. ఆయన ఆజ్ఞను శిరసావహించాడు. ఉపమన్యు. భిక్షను స్వీకరించకపోయినా, పాలను త్రాగకపోయినా అతనిలో యే మార్పు లేదు. మిక్కిలిగా ప్రకాశిస్తున్నాడు. మరల కారణం అడిగారు గురువుగారు.

'లేగదూడలు గోమాత పొదుగు నుండి క్షీరం త్రాగేటప్పుడు పైకెగిరిన నురుగును స్వీకరిస్తున్నాను' అని చెప్పాడు. 'నాయనా! లేగ దూడల ఆహారానికి ఆటంకం కలిగిస్తున్నావు. ఇది ఘోరపాపం' అన్నారు గురువుగారు. ఆయనమాటను శిరోధార్యంగా భావించాడు. తినటానికి భిక్షలేదు, త్రాగటానికి పాలు లేవు. ఆకలికి నకనకలాడుతున్న శిష్యుడు ఆకులు తింటున్నాడు. ఒకరోజు జిల్లేడు ఆకులు తింటూ ఘాటుగా, కారంగా, ఉప్పగా ఉన్న ఆకులను నమిలి రసాన్ని మ్రింగటం జరిగింది. ఆ జిల్లేడు ఆకుల్లో వున్న పాలు కళ్ళలో పడి, కంటి చూపు పోయింది. దారి తెలియక తచ్చాడుతూ, కాళ్ళకు రాళ్ళు తగిలి ముందుకు పడుతూ, ముండ్ల పొదలో పడి ముళ్ళు శరీరాన్ని చీరుతూ వుంటే, గాయాలపాలై, చివరకు వొక కూపంలో పడిపోయాడు.

(తరువాయి భాగం కోసం 25 వ పేజీ చూడండి)

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

డిసెంబర్ 2015

నవంబర్ 28 నుండి డిసెంబర్ 6 ఆదివారం వరకు శ్రీసద్గురుదేవుల సప్తవింశతి (27వ) వార్షిక పుణ్యారాధన మహోత్సవాలు.

6 ఆది : శ్రీగురుదశమి

9 బుధ : మాసశివరాత్రి

11 శుక్ర : అమావాస్య

17 గురు : ధనుర్మాస ప్రారంభం. శ్రీ సుబ్రహ్మణ్య షష్ఠి.

21 సోమ : ముక్కోటి ఏకాదశి; గీతాజయంతి - గీతాపారాయణ, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

25 శుక్ర : పూర్ణిమ, క్రిస్మస్ - శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం.

జనవరి 2016

1 శుక్ర : ఆంగ్ల సంవత్సరాది, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

4 సోమ : శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

8 శుక్ర : మాసశివరాత్రి, పావులూరు బ్రాంచిలో ఏకాహం

10 ఆది : అమావాస్య

14 గురు : భోగి శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన, రాత్రి 8గం. శ్రీబాబుకు భోగిపండ్లు పోయుట.

15 శుక్ర : సంక్రాంతి, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన

16 శని : కనుమ, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

24 ఆది : పూర్ణిమ, శ్రీసద్గురుపాదపూజ

26 మంగళ : రిపబ్లిక్ డే

# పరిప్రశ్నేన సేవయా - పరాశర ప్రసాద్

'సమర్థులైన సద్గురుమూర్తి సమాశ్రయాన్ని యెలా పొంద గలుగుతున్నారు? అది ప్రయత్నపూర్వకంగా సాధ్యపడుతోందా?' అన్న ప్రశ్నకు సమాధానంగా శ్రీసద్గురుదేవులు "సాధకుడు ముందుగా అనుసరించే ఉపాసన, గ్రంథ పఠనం ద్వారా శుభేచ్ఛ కలుగుతుంది. శుభేచ్ఛ అంటే భగవంతుని గురించిన లీలలు, కథలు వినాలనే కుతూహలం, అదే సత్సాంగత్యానికి మూలము. సత్సంగము అనేది సత్పురుషులు సమాశ్రయానికి బీజము.



శుభేచ్ఛ శ్రవణానికి దారితీస్తుంది. శ్రవణము పరమార్థాన్ని పొందటానికి మూలము. అదే లభ్యం కాకపోతే మానవునికి ప్రేయశ్శే శిరోధార్యమై, జీవిత గమ్యమే మారిపోతుంది. శ్రేయస్సుకు మూలము సత్పురుషుల సమాశ్రయము.

నీ హృదయంలో అవిచారంగా వున్న చైతన్యశక్తి సత్పురుషుల బోధా శ్రవణం ద్వారా విచారణని కలుగజేస్తుంది. సద్గురుమూర్తి సమాశ్రయం లభించిన తరువాత వారి బోధా శ్రవణం ద్వారా సాధనలో మనస్సు సూక్ష్మ గ్రాహ్యం అయి ప్రపంచం భ్రమగా గుర్తిస్తాడు. అంటే అద్దంలో ప్రతిబింబంగా గుర్తించగలుగుతాడు. క్రమేపీ సాధనలో పైకి యెగబ్రాకిన కొలది బ్రహ్మము కారణము కాదు, ప్రపంచము కార్యము కాదు అని గుర్తించగలిగితే బ్రహ్మసాక్షాత్కారమును పొందినట్లే కదా!

మీకు యింకో సందేహం కలుగవచ్చు. మహాత్ములు మన మధ్యనే వుంటూ ప్రపంచ వ్యవహారాలు నడుపుతూ, మాట్లాడుతున్నారు కదా! అది యెలా సాధ్యం? అలాగయితే జ్ఞానం వికల్పం అవుతుంది కదా అన్న ప్రశ్నను లేవనెత్తి దానికి సమాధానం చెబుతూ సద్గురుదేవులు మనస్సు అనే మాయా శక్తి మహాత్ముల అదుపులోనే వుంటుంది. చూడండి యెంత ఆల్సేషియన్ కుక్క అయినా యజమాని మాటకి

లోబడి వుంటుంది. ఇంకొక విషయం గమనించండి వర్షపు చినుకు కొలనులో వున్న తామరాకుపై పడుతుంది. కాని అది దానికి అంటదు. అది జారిపోతుంది. అది మాహాత్ముల స్థితి. వారు సంఘంలో వున్నా, నిస్సంగులు. అదే వాన చినుకు కొలనులో పడితే ఆ నీటిలో కలిసిపోతుంది. అది సామాన్య మానవుల స్థితి.

సందేహాలకు కారణం పరిపూర్ణ జ్ఞానం లేకపోవటమే. అదే దృఢ అపరోక్ష జ్ఞానం. అది పొందితే సందేహాలు వుండవు" అన్నారు.

(16వ పేజీ తరువాయి భాగం)

ఆశ్రమంలో దౌమ్యులవారు శిష్యుని రాకకోసం యెదురు చూస్తున్నారు. సమయం మించిపోతుండగా, మిగిలిన శిష్యులను పిలిచి 'ఉపమన్యు యెక్కడ?' అని అడిగారు. 'ఆవులను మేపటానికి వెళ్లినవాడు యింకా తిరిగి రాలేదు' అని చెప్పారు శిష్యులు. 'అయ్యో! పాపం! భిక్ష తినవద్దని చెప్పాను, క్షీరం త్రాగవద్దని ఆజ్ఞాపించాను. కోపంతో యెటైనా వెళ్ళాడో, యేమో! అని శిష్యులతో కలిసి వెతకడానికి బయలుదేరాడు. 'నాయనా! ఉపమన్యు యెక్కడున్నావయ్యా?' అంటూ గురువుగారు బిగ్గరగా పిలుస్తూ అరణ్యంలో ప్రయాణం సాగించారు. గురువుగారి గొంతును గుర్తించిన ఉపమన్యువు నూతిలో నుండి 'గురువుగారూ!' అని పిలిచాడు. నూతిలోని ఉపమన్యువుని చూసి శిష్యుల సహాయంతో ఒడ్డుకు చేర్చారు.

నాయనా! ఉపమన్యు ఈ కూపంలో యెలా పడ్డావయ్యా? నీ కంటి చూపు పోవటానికి కారణమేమిటి?' అని అడిగారు. జరిగినదంతా చెప్పాడు ఉపమన్యువు. 'నాయనా! అశ్వనీ దేవతలను స్తుతిస్తే నీకు చూపు వస్తుంది' అని చెప్పటంతో, వారిని ప్రార్థించగా చూపును ప్రసాదించారు. అతని గురుసేవా నిరతికి మెచ్చి వేదాలు, ధర్మశాస్త్రాలు అన్నీ అతని బుద్ధికి స్ఫురించేలాగా గురువు ఆశీర్వదించారు.

ఈ కథ ద్వారా గురుసేవ యెలా చేయాలో, శిష్యుడంటే యెలా వుండాలో వ్యాసులవారు మనకు చక్కగా తెలియజేశారు.

# సరిలేరు మీ కెవ్వరూ

- పెనుమాక నాగేశ్వరరావు

దయచూపటానా, దరి చేర్చటానా ...............సరిలేరు మీకెవ్వరూ
దర్శనమివ్వటానా, ధైర్యం నింపటానా సరిలేరు మీకెవ్వరూ
అభయం ఇవ్వటానా, ఆశీర్వదించటానా సరిలేరు మీకెవ్వరూ
।సద్గురు।

కాపాడటానా, కరుణించటానా సరిలేరు మీకెవ్వరూ
ఆశ్రయమివ్వటానా, ఆదరణ చూపటానా సరిలేరు మీకెవ్వరూ
బాధలు తీర్చటానా, బోధలు నేర్పటానా సరిలేరు మీకెవ్వరూ
గానం పలికించటానా, నామం అనిపించటానా సరిలేరు మీకెవ్వరూ
।సద్గురు।

ధర్మం చెప్పటానా, మార్గం చూపటానా సరిలేరు మీకెవ్వరూ
సేవలు సేయించటానా, సులువుగా నేర్పించటానా సరిలేరు మీకెవ్వరూ
పూజలు జరిపించటానా, పువ్వులు తెప్పించటానా సరిలేరు మీకెవ్వరూ
తోడై నడిపించటానా నీడై తోడుండుటానా సరిలేరు మీకెవ్వరూ
।సద్గురు।



# శ్రీకృష్ణ కర్ణామృతము

(గత సంచిక తరువాయి)

- సుశీలా ప్రసాద

వరమిమ ముపదేశ మాద్రియధ్వం
నిగమ వనేషు నితాన్త చార ఖిన్నాః
విచినుత భవనేషు వల్లవీనా
ముపనిషదర్థము లూఖలే నిబద్ధమ్ ॥



తాత్పర్యము -

ఓ పండితులారా! వేదాలనే అడవులందు తిరిగి తిరిగి అలసిపోతున్నారా? నా బోధను వినండి. మీరు వెదికే ఉపనిష్ప్రతిపాద్యమైన వస్తువు గొల్లభామ యింట్లో రోటికి కట్టబడి వుంది. అక్కడ వెదకండి. తప్పక దొరుకుతుంది. మీ శ్రమ ఫలిస్తుంది. వేదవేద్యుడు, వేద ప్రతిపాదితుడు అయిన పరబ్రహ్మము ఒక్క ఆ భక్తికే కట్టుబడతాడు.

తలల మీద నీటి కడవలనుంచుకుని, దూరమూ భారమూ తగ్గటానికి నందనందనుని గురించి ముచ్చటించుకుంటూ ఆ గోపకాంతలు యమునా నదీ తీరాన నడుస్తున్నారు. వారికి అల్లంత దూరంలో యెవరో వేషభాషలు క్రొత్తగా వున్నవారు కనిపించారు. 'ఎవరయ్యా మీరు? ఏ పని మీద వచ్చారు యిక్కడికి?' అని వాళ్ళను అడిగారు.

"మేము చదువుకున్న వాళ్ళము. మా చదువుల్లో తెలుసుకున్న ఒక ఆయన గురించి వెదుకుతూ వస్తున్నాము' అన్నారు వాళ్ళు. 'అయితే ఆయన పేరేమిటి? ఊరేమిటి?' అని అడిగారు గొల్లభామలు. "ఎవరికి యిష్టమైన పేరుతో పిలిస్తే పలుకుతాడమ్మా. ఊరు కూడా ఇది అని చెప్పలేము. ఎక్కడపడితే అక్కడే ఉంటాడు. మనం గట్టిగా కోరుకుంటే మన దగ్గరే వుంటానని చెప్పాడమ్మా ఆ చదువుల్లో" అన్నారు వాళ్ళు. 'మరి వాని రూపం?' అని అడిగితే, "మనం యెలా ఊహించుకుంటే అలాగే వుంటానని చెప్పాడమ్మా" అన్నారువాళ్ళు. 'చిత్రంగా వుందే మరి వానిని కన్నవాళ్ళు?' అని గోపమ్మలు అడిగిన ప్రశ్నకు, "అన్నవారు, విన్నవారే

కాని కన్నవారు లేరని" చెప్పారువాళ్ళు. 'ఆశ్చర్యంగా ఉందే! మరి తనని యెలాగ చూడగలం?' అనే ప్రశ్నకి సమాధానంగా "శ్రమపడి తనకోసం వెదికితే దొరుకుతానన్నాడమ్మా! అందుకే అన్నిచోట్లా వెదుకుతూ వస్తున్నాము" అన్నారు వాళ్ళు. గోపెమ్మలు ఒకరి ముఖాలు ఒకరు చూసుకుని, యెంతకాలం యిలా శ్రమపడతారుగాని, పోనీ మా గోకుల నాథుని చూద్దురుగాని రండి. మీరు గుర్తుపడతారేమో, అని గోపెమ్మలు వారిని యశోదమ్మ యింటికి తీసుకువెళ్ళారు.

అక్కడ పెరట్లో వున్న రోటికి బంధించబడి వున్న ముద్దుల కన్నయ్యని చూడగానే పరమానందభరితులై " మేము ఊహించిన ఆ రూపమూ, ఆ దివ్యకాంతులూ, మేని సొగసు, ఎర్రని పెదవులపై చిరునవ్వు మా అజ్ఞానాన్ని హరించి, మేము కోరుకున్న పరబ్రహ్మతత్వం మాకు దర్శనమిస్తున్నది గదమ్మా!" అని పొంగిపోతూ నల్లనయ్యకు వందనాలు చేసి, ఇప్పుడు కదా మనం పడిన శ్రమకు తగిన ఫలితం లభించింది అన్నారు. ఇలాగ భక్తికి మాత్రమే కట్టుబడే పరమాత్మ స్వరూపుడు అతడు. "ఎంత చదివినా భక్తి అనేది వుంటే కాని చదువులలో సారం అనుభవంలోకి రాదు" అని తెలుసుకున్నారు ఆ పండితులు.



# కర్మయోగము

(గత సంచిక తరువాయి) - పూజ్య యోగిని శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ

అక్కడి నుంచి యింకొక మెట్టు పైకెక్కి, యిహపరములు రెండూ అశాశ్వతమని తెలిసి, శాశ్వతమైన సచ్చిదానందమును, లేదా ముక్తిని లక్ష్యంగా కలిగిన దశకు చేరుకుంటాడు. ఈ స్థితిలో నిష్కామ బుద్ధితో నిర్వర్తింపబడే అతడి కర్మలన్నీ దివ్యములై, అతడికి కర్మయోగం సిద్ధిస్తుంది. అదే చివరి మెట్టు. దానిపైన జీవన్ముక్తులు, జ్ఞానులు, తమకు అవసరం లేకపోయినా అజ్ఞానులను సన్మార్గ వర్తనులుగా చేయటానికి ఆచరించే లోక కళ్యాణకారకములైన కర్మలుంటాయి. అలా తన నిష్కామ కర్మాచరణం ఫలించి జీవుడు చివరకు నిర్వికల్ప సమాధిని పొంద గలుగుతాడు.

ఎవరయితే జగత్తులో వుంటూ, కర్మలను ఆచరిస్తూ, ఆ కర్మలకు అతీతుడుగా అయి యీ స్థితిని అందుకోవలసినదే కాని యీ స్థితిని అందుకోవటానికి వేరే మార్గం లేదు. అయితే యెటువంటి కర్మలు ఆచరించాలి? ఎటువంటి కర్మల జోలికి పోకూడదు? ఈ మార్గాన్ని అనుష్ఠించటంలో యేమైనా అడ్డంకులున్నాయా? అనే సందేహాలు కలగటం సహజం.

సంధ్యావందనాది కర్మలను ఆచరించినందున ప్రత్యక్ష ఫలాలేవైనా కలిగినా కలగపోయినా వాటిని ఆచరించకపోతే దోషం. కనుక నిత్య కర్మలను, నైమిత్తిక కర్మలను తప్పక ఆచరించాలి. ప్రత్యక్ష ఫలాలు కలుగక పోయినా, తేజస్సు, స్వాధికారం వంటి ఉత్తమమైన అప్రత్యక్ష ఫలాలు అటువంటి కర్మాచరణం వలన తప్పక కలుగుతాయి.

కామ్యకర్మలను మొదట కోరికతో ప్రారంభించినా, క్రమంగా వైరాగ్యాన్ని పెంపొందించుకుని, 'ఈ ఫలాలేవీ శాశ్వతమైన సుఖాలను యీయలేవు కదా, ఆ ఫలాల కంటే అవి ప్రసాదించే భగవంతుణ్ణే కోరితే' అనే భావన కలిగి, చివరకు ఆ కర్మలను ఫలాలతో సహా పరమేశ్వరునికే అర్పించే స్థితికి యెదగాలి. ఏ కర్మలలో మనకు తేలికగా భగవద్భావన కలుగుతుందో, అవి మనకు విహిత కర్మలు, మన స్వకర్మలు. ఏ కర్మలు మనకు భగవద్భావాన్ని కలిగించలేవో, అవి మనల్ని భగవంతుడి నుండి దూరంగా తీసుకువెడతాయో, అవి మనకు నిషిద్ధ కర్మలు. మనం వాటి జోలికి కూడా పోకూడదు.

ఎవరి స్వధర్మాన్ని వారు ఆచరించాలి. తన స్వధర్మం యెంత

గుణహీనమైనదిగా కనిపించినా, పరుల ధర్మం యెంత ఆకర్షణీయంగా, అనుష్ఠాన యోగ్యంగా కనిపించినప్పటికీ కూడా పరధర్మం కంటే స్వధర్మమే మైలైనది. చివరకు స్వధర్మాచరణలో మరణించటం కూడా పరధర్మం ఆచరించడం కన్నా మేలైనది.

అయితే యిది స్వధర్మం, యిది పరధర్మం అని తెలుసుకోవటం యెలా? మనం యెన్నుకున్న మార్గం మనకు సరిపడేది కానప్పుడు, మనం మొదట్లో యేదో చిన్నచిన్నవాటిని సాధించగలిగినా, పోను పోను ఆ మార్గంలో ఆచరణ చాలా కష్టం అవుతుంది. అది మనకు పరధర్మం అని గుర్తించగలగాలి.

అలా కాకుండా మన మనస్సును యే సత్కర్మలు ఆకర్షిస్తాయో, వేటిని ఆచరించటం మొదలుపెడితే, మనం మన గురుదేవుని వద్ద శ్రవణం చేసిన బోధలు మార్గం చూపుతాయో, ఆ దారిని ఆచరించి మనం చేసే కర్మలు మనకు స్వధర్మం అవుతుంది. లేక మన సద్గురుదేవులు మనకు లక్ష్యార్థాన్ని ప్రసాదించి, మనను యేది ఆచరించమని చెబితే అది మనకు స్వధర్మం. వాటికి యితరమైనది నీకు పరధర్మం అవుతుంది. మనం మన స్వధర్మాన్నే అంటిపెట్టుకుని వుంటే తప్పక ఆత్మానుభూతిని పొందుతాము. అలాకాక పరధర్మాన్ని అనుష్ఠిస్తే మన మార్గం, మన లక్ష్యం రెంటినీ పోగొట్టుకుంటాము.

- సశేషం

---

## మెర్రీ క్రిస్మస్



రెండు వేల సంవత్సరాల క్రితం డిశంబరు 25న జీసస్ బెతల్‌హామ్‌లో మేరీ మాతకు పుట్టాడు.ఈయననే ఏసుక్రీస్తు అనికూడా పిలుస్తారు. ఏసుక్రీస్తు జన్మించినప్పుడు ఆకాశంలో ఒక నక్షత్రం వెలిసింది. ఆ నక్షత్రాన్ని అనుసరించి వెళ్ళి ఆ బాలుడిని ముగ్గురు జ్ఞానులు దర్శించారు. దానికి గుర్తుగా ఆ బాలునికి బంగారం, బోళం, సాంబ్రాణి సమర్పించారు. ఒకరి పట్ల ఒకరు ప్రేమానురాగాలు కలిగి ఉండటం, ద్వేషాన్ని విడనాడటం క్రిస్మస్ పర్వదినం ప్రాముఖ్యం."నిన్ను వలె నీ పొరుగు వాడిని ప్రేమించు" అని చిన్న వాక్యంలో అందించిన అద్భుతమైన సందేశం. అందరూ ఎంతో ఆనందోత్సాహాలతో క్రిస్మస్ పండుగ జరుపుకొంటారు.

# అమృతబిన్దూపనిషత్

(శ్రీదండి నిర్మలానంద స్వామి వారి బోధ సంక్షిప్తంగా)

(గత సంచిక తరువాయి) సేకరణ - పరాశర ప్రసాద్

"ధ్యానం అంటే యేమిటి? భావాత్మకమైనదిగా వుండాలి. సద్గురు మూర్తి ఆదేశంతో ధ్యానంలో మంత్రము, మంత్రభావము, మంత్రార్థము అన్ని తెలుసుకోవాలి. ఎన్ని గంటలు ధ్యానం చేసినా, ధ్యానంలో భావం లేకపోతే నిరర్థకమే.

ధ్యానం యేదైనా జడం మీద నిలిపితే యేం లాభం? ధ్యానం యెంతవరకు చేయాలి? నీ అంతఃకరణలో భావాలు అదృశ్యమయ్యే వరకు చేయాలి. అంతఃకరణలో దోషాలు యెందుకు కలుగుతున్నాయి? సంకల్పము ద్వారా మలదోషము, సంచారము ద్వారా విక్షేపము కలుగుతున్నాయి. మల విక్షేప దోషాలను సద్గురుమూర్తి బోధా శ్రవణం ద్వారా తొలగింప వీలవుతుంది.

కాని దేహము నేను అనే ఆవరణదోషము తొలగటం చాలా దుర్లభం. ధ్యానంలో మనస్సు మనం యిదివరలో చేసిన పనుల మీద పరిభ్రమిస్తుంది. లేక నువ్వు టి.వి.లో చూసిన సినిమాలు, సీరియల్స్ మీదకు మళ్ళవచ్చు. దీనిని నివారించటానికి శ్రవణం చేసిన గురు బోధను మననం చేసుకుంటే సాధ్యపడుతుంది.

ఆవరణ దోషం తొలగాలంటే విచారణ చేయాలి. నిరంతర తత్త్వ విచారణ ద్వారా మనస్సు స్థిరపడి నిదిధ్యాస లేక సమాధి స్థితిని సాధించ గలుగుతావు. టి.వి. చూసేటప్పుడు మనస్సు దాని మీద లగ్నమై, ఆ క్రియలో లయమైనప్పుడు, మనస్సుని సత్సంగాలలో వుంచితే యెందుకు మనో లయాన్ని సాధించలేవు? అంటే మనమంతా చేసేది ధ్యానం కాదన్న మాట. ధ్యానం కోసం చేసే ప్రయత్నమే.

ధ్యానంలో మనస్సు నిర్విషయమవ్వాలి. దోషాలు అదృశ్యమవ్వాలి. 'ధీ' బుద్ధి స్థిరపడాలి. సమస్థితిని సాధించాలి. అదే సమాధి. సమస్థితి

అంటే సమభావన. భిన్న భావన కూడదు. ద్వైత బుద్ధి నశించాలి. దోషబుద్ధి రహితం కావాలి.

ధ్యానంలో మనస్సు నిలబడకపోతే అది మిమ్మల్ని తినేస్తుంది. నీ స్వరూపాన్ని తెలియనివ్వకుండా చేసేది ఆవరణ దోషము. ధ్యానం అంటే నిర్విషయం. మనస్సు సుషుప్తిలో యెక్కడకీ పోలేదు. నీలోనే వుంది. కానీ అది అణిగి వుంది. జాగ్రతావస్థలో అది నిన్ను అటు యిటు పరిగెత్తిస్తోంది సుమా! ధ్యానం యెంతవరకు చేయాలి అన్న సందేహం అందరికీ కలుగుతుంది. మనసులో దోషాలన్నీ తొలగేవరకు చేయవలసిందే. అలా కాని పక్షంలో మనస్సు నిన్ను మ్రింగేస్తుంది".

- సశేషం

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

డిశంబరు 2015

6 ఆది - శ్రీ గురుదశమి ఉ॥ 11 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగము, భక్తసమారాధన

25 శుక్ర - పూర్ణిమ - క్రిస్మస్ - ఉ॥ 11 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగము, భక్తసమారాధన

జనవరి 2016

4 సోమవారం శ్రీగురుదశమి; ఉ॥ 11 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగము, భక్తసమారాధన.

14 గురువారం భోగిపండుగ సా. 5-30ని॥లకు శ్రీ సద్గురుపాదపూజ సత్సంగం, భక్తసమారాధన.

23 నుండి 27 వరకు శ్రీ మాతాజీ సత్సంగ కార్యక్రమాలు.

24 ఆదివారం పూర్ణిమ; ఉ॥ 11 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగము, భక్తసమారాధన.

వివరములకు : జగదీశ్వర్ సెల్ - 99856 66797

# అమెరికా పర్యటనలో శ్రీ మాతాజీ బోధ

(గత సంచిక తరువాయి)

- రమణ ప్రసాద్

మానవులకు సుఖ దుఃఖాలు వస్తూ ఉంటాయి. వాటి యందు సమదృష్టి కలిగి ఉండాలి. ఉన్నదాంట్లో తృప్తి కలిగి ఉండాలి. దీని గురించి చిన్న కథ ఉంది -ఒక వ్యక్తి పరమ లోభి. అతని దగ్గర ఒక బంగారు ఇటుక ఉంది. అది ఇంట్లో ఉంటే దొంగల భయం అని దానిని తన పొలంలో గొయ్యి తవ్వి అందులో పాతి పెట్టాడు. రోజూ వెళ్ళి ఆ ఇటుక ఉందో లేదో ఆ గొయ్యిని తవ్వి దానిని చూసుకుని తృప్తి పడేవాడు. అది గమనించినవాడొకడు ఆ ఇటుకను దొంగిలించి దాని స్థానంలో మామూలు ఇటుకను పెట్టాడు. 'నా ఇటుక పోయింది' అని ఇతడు గోల పెడుతుంటే ఆ దారిన వెళ్తున్న ఒక మహాత్ముడు అతనిని ఊరడిస్తూ, 'ఇక్కడ ఉన్నది బంగారు ఇటుకే అని భావించి తృప్తిపడు' అని చెప్పాడు. అప్పుడు అతనికి శాంతి లభించింది. 'నీకు నేను ఉన్నాను రా' అని అభయం ఇచ్చేవాడు గురుదేవుడొక్కడే.,

శ్రీకుమారస్వామి తన తండ్రి వద్ద జ్ఞానాన్ని పొంది, తాను పొందిన అనుభవాన్ని ఇలా వివరిస్తున్నాడు:-

" ఓం అచ్యుతోఽస్మి మహాదేవ తవ కారుణ్య లేశతః
విజ్ఞానఘనయేవాఽస్మి శివోఽస్మికిమతః పరమ్
ననిజం నిజవద్భాతి, అంతఃకరణ జృంభనాత్।
అంతఃకరణ నాశేన, సంవిన్మాత్ర స్థితో హరిః
సంవిన్మాత్ర స్థితిశ్చాఽహమజోఽస్మి కి మతః పరమ్।

తండ్రీ! నీ అపారమైన కరుణ చేత జ్ఞానినైనాను. అంతఃకరణం యొక్క కలవరం చేత సత్యవస్తువును గుర్తించలేకపోయాను. అంతఃకరణ నాశము చేత హరి జ్ఞాన స్వరూపుడై ఉన్నాడు. నేను కూడా జ్ఞాన స్వరూపుడనై ఉన్నాను. కనుక నేను జన్మ లేని వాడనై ఉన్నాను. ఇంతకంటే శ్రేష్ఠమైనది ఏమున్నది? ఆ జ్ఞాని స్థితి ఎలా ఉంటుందో చెబుతూ శ్రీబాబూజీ మహరాజ్ వారు"శ్రీసదాశివ బ్రహ్మేంద్రుల వారు 'బ్రూహిముకుందేతి, రసనే పాహి ముకుందేతి' అని పాడుకుంటూ వెళ్తూ ఉంటే, ఆ దేశపు నవాబు తనని గౌరవించలేదని కోపించి అతని రెండు

చేతులూ ఖండిస్తాడు. అయినా శ్రీ సదా శివ బ్రహ్మేంద్రులవారు ఏమీకానట్లే భక్తి పారవశ్యంతో వెళ్తూ ఉంటే, నవాబు ఆశ్చర్యపడి, 'స్వామీ! మీ చేతులు నేను ఖండించాను' అంటాడు. అలాగా! ఏదీ ఆ చేతులను యధాస్థానంలో పెట్టు' అంటారాయన. అవి అతుక్కు పోతాయి. క్షమాభిక్ష వేడిన నవాబును కరుణించి వెళ్ళిపోతారు శ్రీ సదాశివ బ్రహ్మేంద్రులవారు" అని చెప్పేవారు.

వ్యతిరిక్తం జడం సర్వం స్వప్నవశ్చ వినశ్యతి
చిజ్జడానాంతు యో ద్రష్టా, సో Zచ్యుతో జ్ఞాన విగ్రహః ।

ఆత్మకు అన్యమైన వస్తువులన్నీ జడములు. స్వప్నం వలె నశించేవి. చిత్, జడములను సమముగా చూచువాడే అచ్యుతుడు (విష్ణువు). జ్ఞానమే స్వరూపముగా కలవాడు. ఈ ప్రపంచము జడము. ఈ ప్రంపంచములోని వస్తువులలో చైతన్యము లేదు. కలలో మనం చూసినవన్నీ నిజంగానే కనిపిస్తాయి. మెలకువ వచ్చాక అవి నిజంకావని తెలుసుకొంటాం.

- సశేషం

## పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు

డిశంబరు 2015

6 ఆది: శ్రీ గురుదశమి - రాత్రి 7గం. శ్రీ సద్గురు పాదపూజ

17 నుండి జనవరి 15వరకు ధనుర్మాస సందర్భంగా ప్రతిరోజూ ఉదయం 5గం.లకు నగర సంకీర్తన, శ్రీసద్గురుపాదపూజ.

జనవరి 2016

4 సోమ శ్రీ గురుదశమి. ఉదయం 5-30గం. శ్రీసద్గురుపాదపూజ

14 గురు భోగి రాత్రి 7గం.లకు భోగిపళ్ళుపోయుట, శ్రీసద్గురు పాదపూజ

# సత్సంగామృతం

(గత సంచిక తరువాయి)

- మురళి

గురుదేవులు మనకు యేమని హెచ్చరిక చేశారు? కాలమనే పులి మింగేయటానికి పొంచి చూస్తోంది. ఎప్పుడో పంజాదెబ్బ కొడుతుంది అని మహాత్ములు హెచ్చరిక చేస్తున్నా, దానిని మనం గుర్తించటం లేదు సరికదా పైగా ఆ పులిని రెచ్చగొడుతున్నాము. దేని చేత రెచ్చగొడుతున్నాం? విషయాదులు, యీర్ష్య, అసూయలు, ఒకరి మీద ఒకరు చెప్పుకోవటం వంటి వాటి చేత రెచ్చగొడుతున్నాం. తత్వాన్వేషణ వున్నవారికి యిటువంటివి వుండవు.

గుండె వుంది. అది కొట్టుకుంటుంది. కాని, యిటువంటి జ్ఞానాన్ని, స్మృతిని తీసుకురావలంటే, మెదడులో నుంచి వస్తుంది. మెదడు పనిచేస్తేనే అవయవాలన్నీ పనిచేస్తాయి. గురు స్థానం యెక్కడ? సహస్రారంలో ప్రకాశించేవాడు గురువు. నీకు అందేటట్లుగా వున్నాడని తెలియటం కోసం 'మీ హృదయబాబు' అని ఆయనే స్వయంగా చెప్పారు



అన్నిటికంటె గొప్పవాడైన గురుదేవుడు యిక్కడే వున్నాడు అనే సద్భావనని స్ఫురింప జేస్తున్నారు స్వామి.

మమకారంలో పడకుమురా! మాధవుని తలపరా జీవా! - ఇది శ్రీగురుదేవుల ముఖస్తుగా వచ్చిన కీర్తన. నీవు యెటువంటి పనులలో వున్నప్పటికీ, మాధవుని సదా మదిలో నిలుపుకుని నీ పనులు చేసుకో, మీకు బంధన వుండదు. మహాత్ములు మనందరికీ చెవిలో యిల్లు కట్టుకుని చెప్తున్నారు, మమకారాన్ని పెంచుకోవద్దని. మమకారం యెంతవరకు తెస్తోంది? ఇది నాది, అది నాది అని కనిపించే అన్ని నావంటున్నావు.

నువ్వు ఆత్మస్వరూపానివి. కాని కనిపించినవాటన్నింటిలో మమకారం చెంది విర్రవీగుతున్నావు. నాకు యింత పొలం వుంది, యింత ఆస్థి వుంది, యింత బంగారం వున్నదని విర్రవీగుతున్నావు. నీవు పోతే యిందులో యేదైనా నీతో వస్తోందా? శరీరంలో నుంచి చైతన్యం తప్పుకుంటే

జడమవుతుంది. దానిని శవం అంటారు. ఆ శవాన్ని యింట్లో ఉంచ గలుగుతున్నావా? అలంకారం చేయగలుగుతున్నావా? పోయిందెవరు? ఉన్నదెవరు? ఆ జ్ఞానాన్ని తెలుసుకో.

అజ్ఞానమే చీకటి, వెలుగు లేకపోవటము. కామ క్రోధాది గుణాలు నిన్ను కబళించి జ్ఞానరత్నాన్ని హరిస్తున్నాయి. అందుమూలంగా సత్యమార్గాన్ని గుర్తించలేకపోతున్నావు. ఇప్పుడైనా గుర్తించు. బ్రతుకు తెరవుకోసం కావలసిన తెలివితేటలు యెన్నో సంపాదిస్తున్నావు, కాని బ్రతుకు యెందుకు వస్తోందో తెలుసుకునే జ్ఞానం పొందే ప్రయత్నం చేయుటం లేదు. ప్రాపంచిక విషయాదుల యందు మనస్సు యెంతవరకు వుంచాలో అంతవరకే వుంచాలి. నీదైనది ఒకటుంది. అదే శాశ్వతమైన నిధి. దానిని భద్రపరచుకో!

- సశేషం

---

## జ్ఞాన జ్యోతిని వెలిగించే దీపావళి

ఆశ్వీయుజ మాసంలో అమావాస్య నాడు వచ్చే దీపావళి పండుగను దేశమంతటా ఎంతో హర్షోల్లాసాలతో జరుపుకొంటారు. శ్రీరాముడు రావణుని వధించి సీతా సమేతంగా అయోధ్యకు వచ్చిన రోజు. ఈ రోజుననే శ్రీకృష్ణుడు సత్యభామా సమేతుడై నరకాసురుడిని సంహరించాడు. పాండవులు 13 సం॥ వనవాసం, ఒక సంవత్సర కాలం అజ్ఞాతవాసం ముగించుకొని రాజ్యానికి వచ్చిన సందర్భంగా ప్రజలు దీపాలు వెలిగించి స్వాగతం పలికిన రోజు.




దీపావళి రోజున భక్తులు శ్రీబాబూజీ మహరాజ్ వారికి అభ్యంగన స్నానం చేయించే వాళ్ళు. శ్రీ బాబు వచ్చి ఆసీనులు కాగానే నుదుట తిలకము దిద్ది, శిరస్సు పైన నువ్వుల నూనె ఉంచేవారు. శ్రీబాబు భక్తులకు దీపావళి విశిష్టత గురించి చెప్పేవారు. సత్యభామ నరకాసురుని వధించిన వైనం తెలిపేవారు. ఆ రోజు రాత్రి శ్రీబాబూజీ మహరాజ్ వారి సమక్షంలో భక్తులు బాణాసంచా కాల్చేవారు. అదే పరిపాటిగా దీపావళి నాడు భక్తులందరూ శ్రీ సద్గురు పాదపూజ చేసుకొని శ్రీమాతాజీ వారి ఆశీస్సులు పొందుతారు. ఆ రోజు రాత్రి శ్రీమాతాజీ వారి సన్నిధిలో భక్తులందరూ టపాసులు కాలుస్తారు.

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

## కోటిపల్లి మామ్మగారు

ఎప్పుడైనా శ్రీ బాబు వస్తే, వారికి పెట్టటానికి ఉంటుందనే వుద్దేశంతో మామ్మగారు పాలకోవాలు ఒక టిఫిన్ కారియర్ నిండుగా చేసి భోషాణంలో దాచి పెట్టారు. కాసేపు పడుకొని లేచాక, భోషాణం తెరిస్తే టిఫిన్ కారియర్ కనబడలేదు. అప్పుడు విజయ (పోతునూరు అక్కయ్య చెల్లెలు) స్కూల్లో చదువుకునే పిల్ల. తీస్తే అది ఒక్కతే తీయాలి. అందుకని ఆ పాపను చాలా దండించి నిలదీసి అడిగారు. కాని తానేమీ ఎరుగనని ఆ పిల్ల ఏడ్చింది. వాళ్ళింట్లో శ్రీ బాబు కోసం ఒక గదిని ఎప్పుడూ కేటాయించి ఉంచారు. ఒకరోజు విజయ స్కూలు నుంచి వచ్చి శ్రీ బాబు ఉండే గది వైపు వెళ్ళింది. కాసేపటికి పాలకోవా తింటూ వచ్చి "అమ్మమ్మా! బాబు గదిలో కూర్చొని పాలకోవా తింటున్నారు. ఇదిగో నాకు కూడా పెట్టారు" అని చూపించింది. వాళ్ళు హడావిడిగా శ్రీ బాబు గదిలోకి వెళ్ళి చూస్తే ఎవరూ లేరు. ఇదంతా విజయ ఆడిన నాటకమే అని వాళ్ళు ఆ అమ్మాయిని మళ్ళీ దండించారు.



ఒక రోజున వాళ్ళు శ్రీ బాబు గది తుడవటానికి వెడితే, ఆ గదిలో ఆ టిఫిన్ కారియరు, సగం ఖాళీ అయి ఉన్నది కనబడింది. మళ్ళీ విజయను దండించారు. స్కూలు బట్టలతో విజయ దానిని ఎన్నిసార్లో ముట్టుకొని మైలపరచి ఉంటుందని, అది శ్రీబాబుకు పెట్టటానికి గాని, తమ మడికిగాని పనికి రాదని యింట్లో పనిచేసే మనిషికి మిగిలిన కోవా అంతా యిచ్చేశారు.

కొన్నాళ్ళ తరువాత ఒకరోజు శ్రీ బాబు వాళ్ళింటికి వచ్చారు. విజయ ఏడుస్తూ శ్రీ బాబుతో "ఆ రోజు మీ గదిలో మీరు పాలకోవాలు తింటూ నాకు పెట్టారా లేదా? నిజం చెప్పండి. వీళ్ళేమో ఆ కోవా నేను దొంగతనంగా తీసుకుని తిన్నానని నన్ను రోజూ చావగొడుతున్నారు. మీ మూలంగా నేను దెబ్బలు తినవలసి వచ్చింది" అని మొత్తుకుంది.

శ్రీబాబు పకపక నవ్వుతూ ఆ పాపను ఒడిలోకి తీసుకుని, "పోనీలేవే, ఆ కోవా చెయ్యటమైతే నా కోసమే చేశారుగాని వాళ్ళకు అది నేను తింటుండగా చూసే యోగ్యత లేదు, నేను తీసుకొనగా మిగిలిన ప్రసాదము తినే యోగమూ లేదు. ఎందుకంటే, వాళ్ళు "మడి" అనే దడిని అడ్డంగా కట్టుకున్నారు. చూసే యోగం లేకపోయినా, చేసింది నా కోసం కనుక, వాళ్ళ సంకల్పంతోనే అది నాకు నివేదన అయింది. నీకు ప్రసాదం అందింది. ఇంత జరిగినా, యిదంతా "గురులీల" అని అర్థం చేసుకోలేక, కనబడిన మిగిలిన ప్రసాదాన్ని కూడా పనిమనిషికి యిచ్చేశారు. నువ్వు లక్కీ ఛాన్స్ కొట్టేశావు " అన్నారు. మిగిలిన వాళ్ళు తెల్ల మొహాలు వేశారు.

కోటిపల్లి మామ్మగారి దొడ్లో ఒక జామ చెట్టు ఉండేది. దానికి పెద్ద పెద్ద జామ పళ్ళు చాలా తియ్యనివి కాసేవి. మామ్మగారు ఆ పళ్ళు ఎవరినీ కోయనీయకుండా ఉంచి, బాగా పండిన తరువాత అవి కోయించి, శ్రీ బాబుకు నివేదన చేసిన తరువాతనే పిల్లలికి తినటానికి యిచ్చేవారు. ఒకసారి ఆ చెట్టు మంచి దోర కాయలతో ఉంది, విజయ స్కూలు నుంచి వచ్చి, దొడ్లోకి వెళ్ళేసరికి, శ్రీ బాబు ఆ చెట్టు మీద జామ పండు తింటూ కనబడ్డారు.

అప్పటికి విజయ చిన్న పిల్ల. శ్రీ బాబుతో "అదేమిటి బాబూ? అమ్మమ్మ ఎవరినీ తినవద్దని, మీకు నైవేద్యం పెట్టటం కోసం అవి వుంచింది. నైవేద్యం పెట్టకుండా తింటే అమ్మమ్మ కోప్పడుతుంది" అంది. శ్రీ బాబు "విజయా! నువ్వు చాలా మంచిదానివి కదూ! అమ్మమ్మకు నేను తింటున్నట్లు చెప్పకేం! నీకు కూడా యిస్తాను తిను" అని, తాము తింటున్న జామ పండును సగం కొరికి విజయకిచ్చారు. విజయ సంతోషంగా అది తింటూ, ఎగురుకుంటూ యింట్లోకి వెళ్ళింది. మామ్మగారు చూసి "శ్రీ బాబు వస్తారని నేను వాటిని ఉంచితే ఎందుకు కోశావు?" అని కొట్టబోతే, విజయ "నేను కోయలేదు. బాబుగారే కోశారు. కావాలంటే వెళ్ళి చూడు. జామ చెట్టు మీద బాబుగారు కూర్చుని, జామకాయలు తింటున్నారు. ఆయనే నాకు యీ ముక్క యిచ్చారు" అంది. అంతా హడావిడిగా దొడ్లోకి వెళ్ళి చూస్తే చెట్టు మీద ఎవరూ కనబడలేదు. పిల్ల అబద్ధం చెప్పిందని దానిని కొట్టారు.

- సశేషం

-గత సంచిక తరువాయి

# విష్ణు  కథలు

- రమణ ప్రసాద్

## కబీర్‌దాస్

ఒకసారి ధర్మదాసు దంపతులు హోమం చేస్తుంటే "నువ్వు ఘోరపాపం చేస్తున్నావు" అన్నాడు కబీరు. ధర్మదాసు హోమంలో వేసే కర్రలలో ఎన్ని పురుగులు ఉన్నాయో అవి అగ్నిలో పడి మరణిస్తున్నాయి. అది చూసిన ధర్మదాసుకి దుఃఖం ముంచుకొచ్చింది. చూస్తే కబీర్ అక్కడ లేడు. అప్పుడు అతనికి గుర్తుకొచ్చింది. ఈ మహాత్ముడినే తాను గంగ ఒడ్డున కలుసుకున్నాను అని. ఆయన రాక కోసం ఎదురు చూశాడు. కబీర్‌ను కలవాలి అనే ఆకాంక్ష రోజు రోజుకి అధికమవసాగింది. అతని భార్య "మీరు యజ్ఞం చేసి సాధువులందరికీ సంతర్పణ చేయండి. ఆ సాధువు తప్పకుండా వస్తాడు" అంది. ధర్మదాసు కాశీలో అనేక యజ్ఞాలు చేసి సంతర్పణలు చేశాడు.



కానీ కబీర్ రాలేదు. ఈ యజ్ఞ యాగాలలో ఎంతో ధనం ఖర్చు అయింది. వ్యాపారంలో బాగా నష్టం వచ్చింది. గత్యంతరం లేక తన జీవితాన్ని అంతం చేసుకోవాలని నిశ్చయించుకున్నాడు. జన సంచారం లేని నిర్మానుష్యమైన నదీ తీరంలో మునిగి ప్రాణత్యాగం చెయ్యబోతుంటే అతనికి పరిచితమైన మానవాకృతి కనిపించింది. అది తాను వెతుకుతున్న తేజస్వి రూపమే. అతడు కరుణాపూరితమైన దృష్టితో ధర్మదాసును చూశాడు. ధర్మదాసు కబీర్ చరణాలపై వ్రాలిపోయాడు. "మహాత్మా! ఎన్నో నెలలుగా మీ కోసం వెతుకుతున్నాను. ఎన్నో యజ్ఞాలు చేశాను. నా ధనం అంతా ఖర్చు అయిపోయింది. కాని మీరు రాలేదు. అన్నాడు.

కబీర్ ఎంతో ప్రేమతో లేవనెత్తి "ధర్మదాస్! ఇలా జరగాల్సి ఉంది. నువ్వు విచారించకు. నీకు నామ ధనాన్ని ప్రసాదిస్తున్నాను. దాని ముందు మూడు లోకాల సంపద సరితూగదు." ధర్మదాస్ కబీర్ వద్ద ఉపదేశం పొంది జ్ఞానశీలుడైనాడు.

కబీర్ ఏ మాత్రం సంకోచం లేకుండా దురాచారాలను విమర్శించాడు. విగ్రహపూజలు, తీర్థయాత్రలు ఉపవాసాలు తీవ్రంగా ఖండించాడు. "మాలిక్ కేవలం మందిరాలలో గాని మసీద్‌లలో గాని ఉంటే, మిగిలిన చోటల ఎవరు వ్యాపించి ఉన్నారు? ఖుదా పశ్చిమాన ఉంటే, మిగిలిన దిశలలో దేవుడు లేడా? బ్రాహ్మలు ఏకాదశి నాడు, కాజా రమ్‌జాన్ దినాలలో ఉపవాసం చేస్తారు. మిగిలిన దినాలు దేవుడివి కావా? కపట బుద్ధి కలవాడు ఎన్ని క్షేత్రాలు దర్శించినా, ఏం లాభం? స్త్రీ పురుషులను సృష్టించింది భగవంతుడే. నేను రాముడు, అల్లాల పుత్రుడను. మహాత్ములను, పీర్లను ఆదరిస్తాను. స్త్రీ పురుషులందరికీ నేను చేసే ఉపదేశం ఒకటే. నామం చేయటం అభ్యాసం చెయ్యండి. భవసాగరం నుండి తరించటానికి ఇది ఒకటే మార్గం. మానవ శరీరంలో ఉండి మాట్లాడిస్తున్నది హిందువూ కాదు, ముసల్మానూ గాదు. ఆయనను వెతకండి" అని ప్రజలకి హితబోధ చేశాడు కబీర్.

కబీర్ 120 సంవత్సరాలు జీవించాడు. ఒకనాడు కబీర్, "నాకు అంతిమ సమయం వచ్చింది. నేను మగహర్‌లో దేహత్యాగం చేస్తాను అన్నాడు. మగహర్ దుర్భాగ్యమైన నగరంగా భావించబడేది. కాశీలో ప్రాణత్యాగం చేస్తే వైకుంఠం ప్రాప్తిస్తుంది అని అక్కడి ప్రజల నమ్మకం. మగహర్‌లో చనిపోతే గాడిద జన్మ వస్తుందని ప్రతీతి. దానికి కబీర్ "హృదయం పవిత్రంగా లేకపోతే కాశీలో చనిపోయినా నరకం నుండి తప్పించుకోలేరు" కాని భగవద్భక్తుడు మగహర్‌లో చనిపోయినా అతడు ముక్తి పొందటమే కాక తన శిష్యులను కూడా తరింపచేస్తాడు.
"స్వర్గం నరకం అనేవి లేవు. సద్గురు కృప వలన నాకు స్వర్గానికి వెళ్ళాలని కోరిక లేదు. నేను సింహాసనం ఎక్కి పరమాత్మలో లయమవుతాను" అన్నాడు. 1518లో కబీర్ ఆత్మ పరమపిత పరమాత్మలో లీనమైంది.

- సశేషం

---

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL